# ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లేదు...

**- వైద్య వృత్తి దైవంతో సమానం...- జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**

**అచ్చంపేట, జనవరి 12, ప్రభాతవార్త:** ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ప్రజలు ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లేదని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం అచ్చంపేట పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది హాజరు పట్టీకను పరిశీలించి విధుల పట్ల నిర్లక్ష్యం వహించి గైర్హాజరైన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో మంది సిబ్బంది ఉండాలి, ప్రస్తుతం ఎంత మంది అందుబాటులో ఉన్నారని సమాచారాన్ని అందించాలని ఆర్డీఓకు సూచించారు. ఆసుపత్రిల్లో ఉన్న వివిధ వార్డులోని భాగాలను పరిశీలించారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది కలెక్టరేట్‌కు తరలిరావాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కాకపోతే అంకితభావంతో ప్రజలకు వైద్య సేవలు అందించకపోతే వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. గత కొద్ది రోజుల క్రితం అచ్చంపేటలో జరిగిన తల్లిబిడ్డల ప్రాణాలు అధికారుల నిర్లక్ష్యం కారణంగానే కోల్పోయారని, మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదన్నారు. ఆయన వెంట ఆర్డీఓ పాండునాయక్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఆసుపత్రిలో హాజరు పట్టీకను పరిశీలిస్తున్న కలెక్టర్

మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తాం..

**రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి.శ్రీనివాస్‌గౌడ్**

**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి12 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. త్వరలోనే మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో పర్యటించి వార్డులలో నెలకొన్న సమస్యలను ప్రజల ద్వారా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. గురువారం ఆయన మహబూబ్‌నగర్ మున్సిపల్ పరిధిలోని పోచమ్మ కాలనీలో సుమారు రూ. 76లక్షల వ్యయంతో నిర్మించిన బిటి రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో పోచమ్మ కాలనీ, సాగర్ కాలనీ వివేకానంద నగర్ కాలనీలో రహదారి సౌకర్యం, తాగునీరు లేక గతుకుల రోడ్లతో వర్షం వచ్చినప్పుడు 15 రోజులపాటు నీటిలో ఉండే పరిస్థితితో ఈ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, తాము అధికారంలోకి వచ్చాక అన్ని సమస్యలను తీర్చామని, ప్రతిరోజు మిషన్ భగీరథ తాగునీటితో పాటు, రహదారుల నిర్మాణం, డ్రైనేజీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా పోచమ్మ కాలనీనుండి నిర్మించిన బిటి రోడ్డును బైపాస్ వరకు అనుసంధానం చేసేలా నిర్మించామని, అదేవిధంగా అన్ని కాలనీలలో కూడా రహదారులను అనుసంధానించే విధంగా చేస్తున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ పట్టణాన్ని ఒక అత్యంత సుందరమైన నగరంగా, ప్రణాళికాబద్ధంగా ఉండేలా అభివృద్ధి చేస్తామని అన్నారు. ఆయా వార్డులలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి త్వరలోనే వార్డు పర్యటనలు చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా ద్వారకాపురి కాలనీ ప్రజలు వారి కాలనీలో విద్యుత్, ఇతర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా అధికారులను పిలిపించి పరిష్కరించారు. ఆయా వార్డులలోని ప్రజాప్రతినిధులు వార్డు ఇంఛార్జిలు, వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్యలను గుర్తించి వారి సమస్యలు పరిష్కరించాలని మంత్రి సూచించారు. మున్సిపల్ ఛైర్మన్ కెసి నర్సింహులు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉపాధ్యక్షులు కోరమోని వెంకటయ్య, మార్కెట్ కమిటి ఛైర్మన్ రహమాన్, కౌన్సిలర్లు వనజ, రోజా, రవికిషన్‌రెడ్డి, కిశోర్ తదితరులు మంత్రి వెంట ఉన్నారు.



బిటిరోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# అంధత్వం లేకుండా చేయడమే ధ్యేయం..

**ప్రజలకు అవగాహన కల్పించాలి:ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,జనవరి 12 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు నిర్వహించడం గర్వకారణమని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో ఏ ఒక్కరు కూడా అంధత్వంతో బాధపడకుండా చూడనున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 18 నుండి నిర్వహించనున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంపై గురువారం జడ్చర్లలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలో నిర్వహించనున్న కంటి వెలుగు కార్యక్రమానికి 40 వేల రీడింగ్ అద్దాలు ముందుగానే జిల్లాకు వచ్చాయని, వీటితోపాటు, ప్రిస్క్రిప్షన్ అద్దాలు అందిస్తామన్నారు. క్యాటరాక్ట్ ఆపరేషన్ అవసరమయ్యే వారికి కాటరాక్ట్ ఆపరేషన్లు కూడా చేస్తామని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా గ్రామాలు, మున్సిపల్ వార్డులలో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసి కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ఏ ఒక్కరూ అందత్వంతో బాధపడకూడదన్న ఉద్దేశంతో అతిపెద్ద కార్యక్రమం కంటి వెలుగును చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని వియవంతం చేయాలని కోరారు. కంటి వెలుగు కార్యక్రమంపై గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. మండల

- మిగతా2లో..



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

# ఈవిఎంల భద్రత మరింత కట్టుదిట్టం చేయాలి

**గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**

**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి12 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా ఎన్నికలకు సంబంధించిన ఈవిఎంల భద్రత మరింత కట్టుదిట్టం చేయాలని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. గురువారం ఉదయం జిల్లాకు వచ్చిన కొత్త ఈవిఎంలను వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో ఈవిఎం గోదాములో భద్రపరిచారు. జిల్లా కలెక్టర్ ఉదయం 9 గం.లకే ఈవిఎం గోదాంకు చేరుకుని, రెండు పెద్ద వాహనాల్లో వచ్చిన ఈవిఎంలను పరిశీలించి ఓపెన్ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్

- మిగతా2లో..



ఈవిఎం గది భద్రతను పరిశీలిస్తున్న కలెక్టర్

# కంటివెలుగును విజయవంతం చేయాలి..!

**రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంపై వైద్యారోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు సమీక్ష**

- కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలి..
- రాష్ట్ర వ్యాప్తంగా 12748 వైద్య శిబిరాలు..
- జిల్లా కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలి..
- కంటి వెలుగు కార్యక్రమంపై కలెక్టర్లు, వైద్యశాఖ అధికారులతో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు వీడియో కాన్ఫరెన్స్..

**మహబూబ్‌నగర్ బ్యూరో,వనపర్తి ప్రతినిధి, నాగర్‌కర్నూల్ ప్రతినిధి జనవరి 12 ప్రభాతవార్త :** ఈ నెల 18 నుండి నిర్వహించనున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమానికి సంసిద్ధంగా ఉన్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్‌పవర్ రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి టి. హరీష్‌రావుకు తెలియజేశారు. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్ల విషయమై గురువారం రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, వైద్యారోగ్యశాఖఅధికారులతో విడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో కంటి వెలుగు నిర్వహణకై చేసిన ఏర్పాట్లపై స్థానిక సంస్థ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వఆదేశాల మేరకు కంటి వెలుగుపై జిల్లా, మున్సిపల్, మండల స్థాయిలో సమావేశాలను నిర్వహించడం జరిగిందని, సీనియర్ అధికారులు కంటి వెలుగు శిబిరాలను సందర్శించే విధంగా ఉత్తర్వులు జారీ చేశామని, గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలు, మండలాలలో అంగన్‌వాడి, ఆశ కార్యకర్తలు, ఎఎన్ఎం, వైద్య, ఇతర బృందాల నియామకానికి సంబంధించిన ఉత్తర్వులను జారీ చేశామని తెలిపారు. జిల్లాకు 47 దృష్టి పరీక్షలకు సంబంధించిన మిషన్లు వచ్చాయని, అదేవిధంగా కంటి అద్దాలు కూడా వచ్చాయని, కంటి వెలుగుకు సంబంధించిన సామాగ్రిని ఈ రోజు పంపిణీ చేస్తున్నామని, సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని, అదేవిధంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహించే క్యాంపు ప్రాంతాలలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామని, కంటి వెలుగు శిబిరాలకు అర్హులైన వారిని రప్పించేందుకు మొబిలైజేషన్ ప్రణాళిక రూపొందించామని, వైద్య బృందాలకు రవాణా సౌకర్యాలు, భోజనం వంటి ఏర్పాట్లు అన్నింటిపై ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈనెల 18న రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర స్థాయిలో కార్యక్రమాన్ని ప్రారంభించిన వెంటనే రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ప్రజాప్రతినిధులు, ఆయా ప్రాంతాలలో మండల, గ్రామస్థాయిలో గ్రామ సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, స్పెషల్ ఆఫీసర్లు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించే విధంగా ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు సూచనలు ఇస్తూ కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లతో పాటు, రెవెన్యూ అదనపు కలెక్టర్ కూడా భాగస్వాములు కావాలని అధికారులు, ప్రజాప్రతినిధులందరిని భాగస్వాములు చేయాలని ఆదేశించారు. మరోసారి కంటి వెలుగు నిర్వహణపై ఎంపిడిఓలు, తహసిల్దార్‌లు, ఎంపిలు, పంచాయతీ కార్యదర్శులతో జూమ్ సమావేశం నిర్వహించాలని చెప్పారు. వైద్య బృందాలకు మంచి వసతి, సౌకర్యాలు కల్పించాలని, కంటి వెలుగు ఏర్పాట్లపై మరోసారి విడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని, ఈ నెల 16 లోగా 100శాతం సామాగ్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, అదే విధంగా శిబిరాలు నిర్వహించే చోట తగినంత భద్రత కూడా ఏర్పాటు చేయాలని చెప్పారు. కంటి వెలుగుపై ఈనెల 15వ తేదీన మరోసారి విడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. 16 నాటికి పూర్తి స్థాయిలో అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసుకుని 18 నుండి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సంసిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. కంటి వెలుగు వైద్యశిబిరాలకు వచ్చే ప్రజలు తప్పనిసరిగా ఆధార్ కార్డుతో సహా రావాలని ఈ విషయంపై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని మంత్రి కోరారు. విడియో కాన్ఫరెన్స్ అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షిస్తూ కంటి వెలుగు నిర్వహణ ఏర్పాట్లపై ఈనెల 13న కంటి వెలుగు బృందాలతో మధ్యాహ్నం 3 గం.లకు ఐడిఓసి సమావేశ మందిరంలో మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు, తహసిల్దార్లు, ఎంపిఓలు అదేవిధంగా కంటి వెలుగు బృందంలోని అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించే సమన్వయ సమావేశానికి అందరు హాజరు కావాలని ఆదేశించారు. కంటి వెలుగు శిబిరాలకు హాజరయ్యే 18 సంవత్సరాలు పైబడి ఉన్న వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌తో సహా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో కంటి వెలుగు శిబిరాలు నిర్వహించే గ్రామాలు, తేదీలపై పూర్తి సమాచారాన్ని గ్రామస్థాయి వరకు తీసుకువెళ్లాలని ఆయన కోరారు. కంటి వెలుగు నిర్వహణకు అవసరమయ్యే సామాగ్రి, వాహనాల ఏర్పాటు, బృందానికి భోజనం, వసతి ఏర్పాట్లు అన్నింటికి ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేయాల్సిందిగా ఆయన వైద్యారోగ్యశాఖ అధికారి డా. కృష్ణను ఆదేశించారు. అదేవిధంగా మరోసారి జిల్లా, మండల స్థాయిలో సమన్వయ సమావేశాలను నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. కృష్ణ, డిపిఓ వెంకటేశ్వర్లు, కంటి వెలుగు బ్లైండ్‌నెస్ కంట్రోల్ పిఓ వినోద్, క్వాలిటీ కంట్రోలర్ మోతిలాల్, డెమో తిరుపతయ్య తదితరులు విడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు



కాన్ఫరెన్స్‌కి హాజరైన కలెక్టర్ షేక్‌యాస్మిన్‌భాష, అదనపు కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్, జిల్లా అధికారులు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

# అధికారమా.. అహంకారమా..!

- సర్పంచ్‌ల గోడు వర్ణణాతీతం...
- నేనింతే... నా రూటే సపరేట్...
- ఎవడైతే నాకేంటి.. వినకపోతే వేధింపులు
- వివాదాలకు కేరాఫ్....



**వంగూరు, జనవరి 12, ప్రభాతవార్త:** వివాదాలకు కేరాఫ్ అడ్రస్ ఆ అధికారి. ఆయన పేరుగానే చెప్పగానే క్రింది స్థాయి నుంచి పై స్థాయి అధికారులు తలపట్టుకుంటారు. అబ్బా ఆ వ్యక్తి హా అంటూ అసహనం వ్యక్తం చేస్తారు. విధుల్లో కఠినత్వం అంటే ఆయన క్రింది స్థాయి ఉద్యోగులపై చూపించే శాడిజానికి అందరు జడ్చుకుం టారు. ఇప్పటికి ఆయన సర్వీస్‌లో ఎన్నో మండలాలు, జిల్లాలతో పాటు ఏకంగా రాష్ట్రం కూడా మారిన తీరు మాత్రం మారలేదు. కొల్లాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో విధుల్లో చేరేందుకు వెళ్లగా స్థానిక శాసనసభ్యులు ఇక్కడ వద్దంటూ మౌచక ఆదేశాలు జారీ చేయడంతో వంగూరు మండలానికి వచ్చి తీష్టవేశారు. మండలంలో విధుల్లో చేరిన రోజు నుంచి వివాదాలు. వంగూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారు తీరు ఇది. నిత్యం ఎన్నో వివాదాలకు నిలయంగా మారుతూ చివరకు ప్రజా ప్రతినిధులతో సైతం బాహటంగా సై అంటే సై అంటూ గొడవకు దిగడం విశేషంగా మారింది. సర్పంచ్‌ల గోడు

**వర్ణణాతీతం....**

గ్రామాల్లో అభివృద్ధి పనులు నిర్వహించిన సర్పంచ్‌లకు బిల్లులు అందించడంలో నిర్లక్ష్యం వహించడం వల్ల మండలంలో ఉన్న 27 మంది సర్పంచ్‌లు

- మిగతా2లో..

# పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

**రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి.శ్రీనివాస్‌గౌడ్**

**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 12 ప్రభాతవార్త :** పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్నదని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. గురువారం ఆయన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో 71 మంది లబ్ధిదారులకు రూ. 71,08,236 కళ్యాణలక్ష్మి, షాదీము బారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా లబ్ధిదారులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పెన్షన్లు, వికలాంగుల, పెన్షన్లు, వితంతు పెన్షన్లు ఇస్తున్నామని ఇంటింటికి మిషన్ భగీరథ మంచినీరు, రైతులకు ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుభీమా, దళితబంధు వంటి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నదని తెలిపారు. ప్రజలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని వేళలా సిద్ధంగా ఉంటుందని ముఖ్యంగా ఏ ఆపద వచ్చినా తనకు సమాచారం అందిస్తే సహకారం అందిస్తామని మంత్రి వెల్లడించారు. ఈనెల 18న నిర్వహించనున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేయనున్న దృష్ట్యా కంటి చూపు సమస్య ఉన్న వారందరు కంటి వైద్య శిబిరాలకు వచ్చిపరీక్షలు చేయించుకుని ఉచితంగా కంటి అద్దాలను కూడా పొందవచ్చని మంత్రి సూచించారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు విజయవంతం చేయాలని కోరారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, జిల్లా ఎస్పీ ఆర్. వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రాజేశ్వర్‌గౌడ్, ఎంపిపి సుధాశ్రీ, మార్కెట్ కమిటి ఛైర్మన్ అబ్దుల్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.



కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేసిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఆల..

**వనపర్తి ప్రతినిధి,జనవరి 12 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట మున్సిపాలిటీలో స్థానిక సంగిల్‌విండో కార్యాలయ ఆవరణలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని కర్తదానం చేసిన పలువురిని అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షేక్‌యాస్మిన్‌భాష, జడ్పీ వైస్ ఛైర్మెన్ వామన్ గౌడ్,ఎంపీపీ గుంత మౌనిక, మున్సిపల్ ఛైర్మెన్ పొగాకు సుకేషిని, సింగిల్‌విండో ఛైర్మెన్ కొట్టం వంశీధర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ పొగాకు విశ్వేశ్వర్, బాబూల్ రెడ్డి, జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మెన్ ఖాతాకుతుబుద్దీన్, వైస్ ఛైర్మెన్ సయ్యద్ కలాం పాషా, జాయింట్ సెక్రటరీ జేఎం మిషేక్, జూనియర్ రెడ్ క్రాస్ కన్వీనర్ అహ్మద్ బిన్ ఒమర్, గోనూరు యాదగిరి, సామాజిక కార్యకర్త పి.రవీందర్ రెడ్డి, డా.వైష్ణవి, మెడికల్ ఆఫీసర్ తహసిల్దార్ బాల్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీపాద, సాంకేతిక నిపుణులు తిరుపతయ్య, శ్రీనివాసులు,మహ్మద్, ఎం.లక్ష్మి, కేతావత్ కార్తీక్, ఆశా వర్కర్లు సీహెచ్ శ్వేత, కె.అమ్ములు, శిక్షార్థులు తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష

# అయోమయంలో.. అన్నదాత..!

**పత్తి ధరలు రైతులను ఆందోళన కల్గిస్తున్నాయి. సీజన్ మొదటల్లో బాగానే ఉన్నా ప్రస్తుతం తగ్గుతూ వస్తున్నాయి. దీంతో అమ్మాలా..వద్దా అని ఎటూ తేల్చుకోలేని స్థితిలో రైతులు ఉండిపోయారు. సీజన్ ప్రారంభంలో క్వింటాకు రూ.9వేల పైనే ఉన్నా ప్రస్తుతం రూ.8వేలు దాటడంలేదు. దీంతో మళ్లీ ధర పెరగకపోదా అనుకుని రైతులు పత్తిని ఇంట్లో, గోదాంలో నిల్వ చేసుకుంటున్నారు.**



జడ్చర్ల పత్తి మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన పత్తి







- అమ్ముదామా..వద్దా..
- పెరుగుతుందా.. తగ్గుతుందా..
- ఎటూ తేల్చుకోలేకపోతున్న అన్నదాతలు
- ఆందోళనచెందుతున్న పత్తి రైతులు
- ధర పెరుగుతుందని ఇంట్లోనే నిల్వలు
- కొద్ది కొద్దిగే మార్కెట్‌కు తెస్తున్న వైనం
- మార్కెట్ రేటు కంటే తక్కువ ధర నిర్ణయించిన సీసీఐ

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,జనవరి12,ప్రభాతవార్త :** పత్తి వ్యాపార పంట. పెట్టుబడి ఎక్కువే. ధరలు అనుకున్న స్థాయిలో వస్తే తప్పా బయటపడని పరిస్థితి. అయినా కూడా రైతులు అప్పు చేసి మరీ పత్తి పంటను వేస్తారు. ధర బాగా వస్తే అప్పుతోపాటు పంటకు చేసిన బాకీ తీరుతుందని ధైర్యం చేసి పంట వేసిన అన్నదాతను మరోసారి ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. గతేడాది క్వింటాకు రూ.10వేలకు పైగా ధర పలికిందని సంబుర పడి అదే ఉత్సాహంతో పంట సాగు చేసిన రైతులకు ప్రస్తుతం మార్కెట్ ధరలు ఆందోళనకల్గిస్తున్నాయి. జూలై, ఆగస్టు కురిసిన అతి భారీ వర్షాలకు పంటకు నష్టం వాటిల్లింది. గతేడాది కంటే సాగు విస్తీర్ణం పెరిగినా దిగుబడి సగానికి పడిపోయినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇదిలా ఉండా సీసీఐ ధరలు మాత్రం ఏమాత్రం గిట్టుబాటు కాకుండా ఉన్నాయని రైతులు విమర్శిస్తున్నారు. పొట్టిగింజ రకం క్వింటాకు రూ.6080,పొడువు గింజ రకానికి రూ.6380గా నిర్ణయించింది.

**తగ్గిన దిగుబడి**

ఈ ఏడాది కురవాల్సిన దానికంటే వర్షాలు అధికంగా కురిశాయి. సాధరణానికి మించి వర్షాలు నమోదు కావడంతో పత్తిచేలు దెబ్బతిన్నాయి. పూత,కాయ దశలోనే ఇబ్బంది కావడంతో దిగుబడి తగ్గింది. ఎకరాకు 10క్వింటాళ్ల వరకు పత్తిపంట రావాల్సి ఉండగా కేవలం 5-ఖ6క్వింటాళ్లు దిగుబడి వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. ఇదీ కాగా కలుపుతీత, ఎరువులు, పురుగు మందులకు పెట్టుబడులు కూడా పెరగడంతో ఖర్చులు అధికమయ్యాయి. కూలీల రేట్లు సైతం పెరగడంతో ఎకరాకు 40నుంచి రూ.50వేల వరకు ఖర్చయ్యింది. పెరిగిన ఖర్చుల స్థాయిలో దిగుబడి రాకపోవడంతో ఈసారి లాభాలు దేవుడెరుగు, ఖర్చుల మందం వచ్చినా చాలంటున్నారు.

**పోయినసారి రూ.9700 అమ్మిన..**

నా పేరు వెంకటయ్య. మాది వాడ్యాల,మిడ్జిల్ మండలం. నేను ఈ ఏడాది 6ఎకరాల్లో పత్తి పంట వేసిన. ఇప్పటికి రెండు సార్లు పత్తి మార్కెట్‌కు తీసుకొచ్చా. బుధవారం జడ్చర్ల పత్తి మార్కెట్‌కు మూడున్నర క్వింటాళ్ల పత్తి తీసుకొచ్చా. క్వింటాకు రూ.7399 పలికింది. ఇంతకంటే ఎక్కువ రాదన్నారు. పోయినసారి బాగుండే ధర. క్వింటాల్‌కు రూ.9700 వరకు అమ్మిన. ఇప్పుడేమో ఇట్లుంది. శానా మంది ధర రాక మళ్లీ ఇంటికి తీసుకుపోయిన్రు. సేట్ల గోదాంలు, ఇండ్ల వద్దే నిల్వ ఉంచుతున్నారు. ధర పెరిగితే అమ్ముదామని..ఏమైతదో..పెరుగుతదో లేదో.. సర్కారే ఆదుకోవాలి మమ్మల్ని.



**వెంకటయ్య, రైతు వాడ్యాల,మిడ్జిల్ మండలం**

**లక్ష ఎకరాల్లో సాగు..**

ఈ ఏడాది మహబూబ్‌నగర్ జిల్లాలో లక్ష ఎకరాల్లో పత్తిసాగు చేశారు. గత ఏడాది 90 వేల ఎకరాలు సాగయింది. గత ఏడాది క్వింటా ధర బహిరంగ మార్కెట్‌లో 12 వేల వరకు పలికింది. అదే స్థాయిలో ఈ ఏడాది కూడా ధర ఉంటుందని అనుకున్న రైతులు పత్తి ఎక్కువగా సాగు చేశారు. కానీ ఈసారి ధర 8 వేలకు మించలేదు. ఫిబ్రవరి, మార్చిలో ధర పెరుగుతుందని భావించి పత్తిని ఎక్కువగా మార్కెట్‌లోకి తేవడం లేదు.



**జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు**

## జీన్గరాలలో ఆకట్టుకొన్న ముగ్గుల పోటీలు..

**దేవరకద్ర,జనవరి 12 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం జీన్గరాలలో గురువారం నిర్వహించిన ముగ్గుల పోటీలు చూపరులను ఎంతగానో ఆకట్టుకొన్నాయి. స్వామి వివేకానంద 160 జయంతి వేడుకలను పురస్కరించుకొని ఈ పోటీలు నిర్వహించారు. స్థానిక పాఠశాల ఆవరణలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులంతా పెద్ద మొత్తంలో హాజరై ఈ పోటీలలో పాల్గొన్నారు. సాంస్కృతి సాంప్రదాయం ఉట్టిపడేలా వివిధ రకాల ముగ్గులను వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి,యంపీటీసీ తిరుపతయ్య,పాఠశాల ప్రధానోపాధ్యాయులు కవితలతో పాటు గ్రామపెద్దలు,యువతులు,మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.


జీన్గరాలలో ముగ్గులు వేస్తున్న దృశ్యం

## ఘనంగా స్వామి వివేకానంద 160వ జయంతి..

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,జనవరి 12 ప్రభాతవార్త :** స్వామి వివేకానంద 160వ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ పాలమూరు శాఖ తరపున వన్‌టౌన్ ప్రాంతంలో చౌరస్తాలో స్వామి వివేకానందుని చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. బండ్లగేరిలో శ్రీ సరస్వతి శిశు మందిర్ ఆధ్వర్యంలో స్వామి వివేకానందుని వేషధారణల్లో ఉన్న చిన్నారుల ర్యాలీలో పాల్గొని వారిని అభినందించారు. సంక్రాంతి సందర్భంగా మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వాళ్లకు ఉత్తమమైన ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. అనంతరం భూత్పూర్ పంచవటి ఆసుపత్రిలో కందూరు గ్రామానికి చెందిన కార్యకర్త అనారోగ్యంగా ఉండడం వల్ల వారిని పరామర్శించడం జరిగింది. అనంతరం జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీఎస్ ఆసుపత్రిలో కందూరు గ్రామానికి చెందిన మరొక కార్యకర్తను పరామర్శించి వారి వైద్య సహాయానికి తనవంతుగా సహాయం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణవర్ధన్‌రెడ్డి, బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, రమేష్‌కుమార్, అధికార ప్రతినిధి, ఆఫీస్ ఇంఛార్జి సుబ్రహ్మణ్యం, ఎన్‌పి వెంకటేష్, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.



## 2కె రన్ విజేతలకు బహుమతుల ప్రధానం:ఎస్ఐ

**ఖిల్లాఘణపురం,జనవరి 12 ప్రభాతవార్త:** జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా గురువారం వనపర్తి జిల్లా పోలీస్ పర్యవేక్షణ అధికారి ఎస్పీ అపూర్వరావు ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని క్రీడాప్రాంగణంలో 2కె రన్ పోటీలను మండల పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఎస్ఐ వెంకటేష్ గౌడ్ తెలిపారు.స్వామి వివేకానంద యువతకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. వివేకానందుని ఆశయాలను ఆదర్శంగా తీసుకోని యువత ముందుకు నడవాలని ఆకాక్షించారు. క్రీడలు యువతకు అవసరమని క్రీడలతో శారీరకంగా మాత్రమే కాకుండా మానసికంగా ఎదుగుదల ఉంటుందన్నారు.యువత చెడు అలవాట్లుకు దూరంగా ఉండాలన్నారు.2కె రన్ పోటీల్లో ప్రతిభచాటి ప్రథమస్థానంలో నిలిచిన టి.విష్ణు కమలుద్దీన్‌పూర్,ద్వితీయస్థానం డి.ప్రశాంత్ వట్టిపల్లి, తృతీయస్థానం నరేష్ వనపర్తి, 4వ స్థానం ఎ.సాయికుమార్ కారుకొండ విజేతలకు జ్ఞాపికలను ఎస్ఐ అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సామ్యా నాయక్. మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, మెడికల్ ఆఫీసర్ డా. ప్రవీణ్ కుమార్,, ఈర్లతాండ సర్పంచ్ గోపాల్ నాయక్, క్రీడా సంఘం అధ్యక్షుడు యాదయ్య, కానిస్టేబుల్, పీఈటీ దేవేందర్. యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు మధు యువకులు తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేసిన యంపీపీ

**దేవరకద్ర,జనవరి 12 ప్రభాతవార్త:** దేవరకద్రలో గురువారం ఓ బాదితురాలికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును యంపీపీ కెంగూరి రమాశ్రీకాంత్‌యాదవ్ వారి కుటుంబసభ్యులకు అందజేశారు. మండలంలోని గూరకొండ గ్రామానికి చెందిన లావణ్య అనే బాదితురాలికి సంబందించి అమె భర్త నరసింహ్మలుగౌడ్‌కు స్థానిక యంపీడీఓ కార్యాలయంలో రూ.26వేల ఈ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును యంపీపీ అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కెంగూరి శ్రీకాంత్ యాదవ్,మాజీ యంపీటీసీ ఉమ్మిగారి వెంకటేష్, హుడా కార్యవర్గ సభ్యుడు కరుణం రాజు,నాయకుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## విగ్రహం ఏర్పాటు చేసిన కిషన్‌రావుకు ఘనసన్మానం

**దేవరకద్ర,జనవరి 12 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం కౌకుంట్లలో గురువారం గ్రామంలో స్వామి వివేకానంద విగ్రహం ఏర్పాటుచేసిన గ్రామ నాయకుడు కిషన్‌రావుకు గ్రామస్థులు,గ్రామ యువనాయకులు ఘనంగా సన్మానించారు. గ్రామంలో 2014లో కిషన్‌రావు వివేకానంద విగ్రహం ఏర్పాటు చేశారు. దీంతో స్వామి వివేకానంద 160 జయంతి వేడుకల సందర్భంగా స్థానిక బస్టాండు వద్ద ఆయనకు ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రావుకు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ యంపీపీ గోపాల్,ఉపసర్పంచ్ నీలి నరసింహ్మలు,వార్డు సభ్యుడు రవీందర్‌రెడ్డి,కావలి శేఖర్,జగన్నాథ్‌రెడ్డి,గొల్ల అంజనేయులు,అనిల్,శివ,రఘు తదితరులు పాల్గొన్నారు.



## క్రికెట్ కిట్ అందజేసిన మాజీ మార్కెట్‌చైర్మెన్

**దేవరకద్ర,జనవరి 12 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం పేరూర్‌లో గురువారం దేవరకద్ర వ్యవసాయమార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ అరవిందకుమార్‌రెడ్డి క్రీడాకారులకు క్రికెట్‌కిట్‌ను అందజేశారు. దేవరకద్ర మండలం రేకులంపల్లి గ్రామానికి చెందిన క్రికెట్ జట్టుకు ఈ క్రికెట్‌కిట్‌ను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు శ్రీనివాస్‌యాదవ్, సురేశ్,కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయమార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ అరవింద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో క్రీడాకారులు నిబద్ధతలో క్రీడాపోటీలు నిర్వహించుకోవాన్నారు. ప్రతి ఒక్కరు క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు. క్రీడాకారులు క్రీడల్లో గెలుపు,ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు.



## ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ

**దేవరకద్ర,జనవరి 12 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం దోకూర్ తపోవన్ పాఠశాలలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు గురువారం బహుమతులను అందజేశారు.ముగ్గుల పోటీలలో మొత్తం 28జట్లకు గాను ఉన్నతపాఠశాల విభాగంలో విధ్యార్థిని అభిషాలిని జట్టు మొదటిబహుమతి సాదించింది. అలాగే అర్చన జట్టు రెండవ బహుమతి సాదించింది. మాధ్యమిక పాఠశాల విభాగంలో విధ్యార్థిని భానుతేజ జట్టు మొదటిబహుమతి సాదించింది. అలాగే సాయివర్ష జట్టు రెండవ బహుమతి సాదించింది. ప్రాధమిక పాఠశాల విభాగంలో విధ్యార్థిని వర్షిణి జట్టు మొదటి బహుమతి సాదించింది. రెండవ బహుమతి జననీ జట్టు సాదించింది. ఈ ముగ్గుల పోటీలలో విధ్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. సాంప్రదాయం ఉట్టిపడేలా ముగ్గులను విధ్యార్థులు వేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్స్‌పాల్ నిరంజన్‌రెడ్డి, ఉపాధ్యాయులు సబిహా,చంద్రయ్య,అనురాధ,భవాని,అమీర్,జార్జ్ తదితరులు పాల్గొన్నారు.


దోకూర్ తపోవన్ పాఠశాలలో విజేతలకు బహుమతులను అందజేస్తున్న నిరంజన్‌రెడ్డి

**ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు..**

దోకూర్ తపోవన్ పాఠశాలలో గురువారం వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద చిత్రపటానికి పూల మాలలు వేశారు. ఈ కార్యక్రమంలో పాఠశా ల ప్రిన్స్‌పాల్ నిరంజన్‌రెడ్డి,ఉపాధ్యాయులు సబిహా,చంద్రయ్య,అనురాధ,భవాని,అమీర్, జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వామి వివేకానంద 160 జయంతి వేడుకలు


స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న వాల్మీకి నాయకులు


నివాళి అర్పిస్తున్న విశ్వహిందూ పరిషత్ బజరంగ్‌దళ్ కమిటీ సభ్యులు


పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు, ఎస్ఐ శివకుమార్


వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న దృశ్య

**వనపర్తి టౌన్,జనవరి 12 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో తెలంగాణ వాల్మీకి సంఘం ఆధ్వ ర్యంలో స్వామి వివేకానంద 160వ జయంతి సం దర్భంగా ఓ ప్రైవేటు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిం చారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ మండ్ల దేవన్న నాయుడు, వాల్మీకి సంఘం యువ నాయకులు బుసిరెడ్డి స్వామి మా ట్లాడుతూ భారతదేశాన్ని జాగృతం చేయడమే కాకుండా అమెరికా, ఇంగ్లాండులలో యోగ, వేదాంత శాస్త్రములను తన ఉపన్యాసాల ద్వారా వాదనల ద్వారా పరిచయం చేసిన ఖ్యాతినిక అతనికి ఉందని అన్నారు. గురువు కోరిక మేరకు అమెరికాకు వెళ్లి అక్కడ హిందూ మత ప్రాశస్త్యం గురించి ఎన్నో ఉపన్యాసాలు చేశారని గుర్తు చేశా రు. భారతదేశాన్ని ప్రేమించి, భారతదేశం మళ్లీ తన ప్రాచీన ఔన్నత్యాన్ని పొందాలని ఆశించిన వారిలో ముఖ్యులు స్వామి వివేకానంద అని అన్నారు. పాశ్చాత్య దేశాలలోకి అడుగుపెట్టిన మొదటి హిందూ సన్యాసి ఈయనే అని అన్నారు. తూర్పు దేశాల త్వమును షికాగోలో జరిగిన ప్రపంచ మత జాతర లో 1893లో ప్రవేశపెట్టాడు. అక్కడే షికాగోలో ను, అమెరికాలోని తర ప్రాంతాలలో ప్రజల అభిమానాన్ని చూరగొన్నాడు. తిరిగి భారతదేశం వచ్చి రామకృష్ణ మతాన్ని స్థాపించి దీని ద్వారా భారత యువతకు దిశానిర్దేశం చేశాడు. 39 ఏళ్ల వయసులోనే మరణించారు. అతను చేసిన సేవలకు గుర్తింపుగా 1984లో భారత ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని జాతీయ యువజన దినోత్సవంగా ప్రకటించిందని అన్నారు.

**విశ్వహిందూ పరిషత్ బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో..**

వనపర్తి పట్టణంలోని వివేకానంద మార్గ్‌లో స్వామి వివేకానంద 160వ జయంతి వేడుకలు వనపర్తి విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పట్టణ విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు వేడుకల్లో పాల్గొని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జిల్లా బజరంగ్ దళ్ సవయోజక్ మద్ద శివకృష్ణ మాట్లాడుతూ స్వామి వివేకానంద భారతదేశాన్ని జాగృతం చేయడమే కాకుండా అమెరికా, ఇంగ్లాడులలో యోగ, వేదాంత శాస్త్రములను తన ఉపన్యాసాల ద్వారా, వాదనల ద్వారా పరచియం చేసిన ఖ్యాతి అతనికి ఉందని అన్నారు. గురువు కోరిక మేరకు అమెరికాకు వెళ్లి అక్కడ హిందూ మత ప్రాశస్త్యం గురించి ఎన్నో ఉపన్యాసాలు చేశారని తెలిపారు. భారతదేశాన్ని ప్రేమించి భారతదేశం మళ్లీ తన ప్రాచీన ఔన్నత్యాన్ని పొందాలని ఆశించిన వారిలో ముఖ్యులు స్వామి వివేకానంద అని అన్నారు. ఈ దేశానికి ధర్మానికి ఉపయోగపడని శరీరం, ధనం ఎంత పెరిగిన వృద్ధా అన్న మాటలను వివేకానంద మాటలను స్మరించుకుంటూ యువత దేశ సేవకై, ధర్మ రక్షణకై ఎల్లప్పుడే ముందుండాలని గుర్తు చేశారు. జిల్లా గోరక్షణ్ నీలం ప్రశాంత్ మాట్లాడుతు యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చదువుల్లో రాణించాలని, పరాయి స్త్రీలో తల్లిని, చెల్లిని చూస్తూ సోదరభావంతో ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ బజరంగ్‌దళ్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో..**

వనపర్తి టౌన్,జనవరి 12 ప్రభాతవార్త: అఖల భారతీయ విద్యార్థి పరిషత్ వనపర్తి శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 160వ జయంతి సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వనపర్తి టౌన్ ఎస్ఐ శివ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద నేటి యువతకు ఎంతో స్ఫూర్తి దాయకమని అన్నారు. దేశంలో యువత మేల్కొని ముందుకుపోవాలని సూచించారు. అనంతరం స్వామి వివేకానంత విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర అధ్యక్షులు కురుమూర్తి, నగర కార్యదర్శి బాలకృష్ణ, జిల్లా హాస్టల్ ఇన్చార్జీ తేజ, కౌశిక్, తదితరులు పాల్గొన్నారు.

**మూసాపేటలో...**

మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ విశ్వమానవాళి నవశకం వైపు పరుగులు తీయాలని కోరుకున్న వాడు వివేకానంద అని తెలిపారు. స్వామి వివేకానంద ప్రపంచ మత సమ్మేళనంలో భారతదేశానికి హిందూ మతానికి ప్రాతినిత్యం వహిస్తూ 1893 సెప్టెంబర్ 11న చికాగో లో ప్రపంచ వ్యాప్తంగా పలు మతాల ప్రతినిధులు పాల్గొన్న సమ్మేళనంలో ప్రసంగిస్తూ ప్రియమైన సోదర సోదరీమణులారా అని సంబోదిస్తూ ప్రారంభించడంతోనే శ్రోతలను ఆకట్టుకున్నాడని అన్నారు. సాధారణంగి లేడీస్ అండ్ జెంటిమెన్ అన్న సంబోధనకు అలవాటుపడ్డ వారిని ఈ పిలుపులోని ఆత్మీయత ఆకర్షించిందని అని తెలిపారు. భారతదేశంలో స్త్రీ తత్వం అంటే మాతృత్వమే, నిస్వార్థత, త్యాగశీలత సహనము ఈ గుణాలతో విలసిల్లే స్త్రీ మూర్తియే మాతృమూర్తి అనేవారు. స్త్రీ, పురుషుల సమానత్వానికి కృషి చేసిన ఆధునిక నాయకుడు. సమాజాభివృద్ధికి ఎంతో మేలు చేశాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, స్కూల్ చైర్మెనన తిరుపతయ్య శెట్టి, చంద్రయ్య, కొండయ్య, యాదయ్య, నామాల రవి, సీజీ మధు సాగర్, మున్నూరు రాము, కురుమూర్తి, బల్లి నవీన్, శ్రావణ్, కృష్ణయ్య, సతీష్ సాగర్, శ్రీనివాస్, చెన్నారెడ్డి, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## పొట్టి కవితల గట్టి కవి అలిశెట్టి ప్రభాకర్ 69వ జయంతి.. 30వ వర్ధంతి..

**వనపర్తి టౌన్,జనవరి 12 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో టీజేఏసీ ఆధ్వర్యంలో అక్షర సేద్యం పొట్టి కవితల గట్టి కవి అలిశెట్టి ప్రభాకర్ జనవరి 12న జననం మరణం ఒకే రోజు కావడంతో ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రజావాగ్గేయకా రుడు రాజారామ్ ప్రకాష్ మాట్లాడుతూ కొందరిని కాల్చగలదు గన్ను, ఎందర్నో మండిస్తుంది స్లోగన్, అందరిని కదిలిస్తుంది పెన్ను అతనొకడికి ఆయుధాలు రెండు కుంచె, కలం సాహసం అనే నిప్పుల మీద కాలాన్ని బలంగా ఉండేదుకు నెత్తుటితో ఊపిరి తీసుకోని కష్టాలనే చెమటని సిరాగ నింపుకొని కలంగా మారి కష్టజీవుల కష్టాలను కవితగా మార్చి కన్నీళ్ల కర్తవ్యాన్ని బోదించి దోపిడీ వాదుల గుండెల్లో అగ్ని రగిలించిన అక్షర బాణాన్ని వదిలిన అక్షర సేద్యం కవి అలిశెట్టి ప్రభాకర్ అని అన్నారు. మరణం ఆయన చివరి చరణం కాదు ఎందరో కవులకు అది స్ఫూర్తి అని అన్నారు. జనం మరణం ఒకే రోజు అయినా అక్షర సేద్యం కవి అక్షరాగ్ని కురిపించిన చిత్రకారుడు ఫోటోగ్రాఫర్ చురకలు అంటించిన చురకత్తి చూపుల కవి ఎర్రపావురాల ఎగిరిన రక్తరేఖ సంక్షోభ గీతాలు సీటీ లైఫ్, మంటల జెండాలు ఎగరవేసి, మండే సూర్యుడు ఈ కవి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కవి పండితుడు బూరోజు గిరిరాజాచారి, కవిశ్రేష్టుడు వ్యాఖ్యాత డా.నాయకంటి నరసింహ శర్మ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి తగవుల వెంకటస్వామి, కళాకారుడు నందిమల్ల డప్పు నాగరాజు, ఎస్ఆర్‌టీపీసీ రాష్టన టనాయకులు కోనింటి వెంకటేశ్వర్లు, రజక సంఘం జిల్లా నాయకులు ప్రవీణ్ కుమార్, విశ్వబ్రహ్మణ సంఘం జిల్లా నాయకులు వేణుగోపాల్ చారి తదితరులు పాల్గొన్నారు.


కవి అలిశెట్టి ప్రభాకర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

## అంధత్వం లేకుండా చేయడమే ధ్యేయం:ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మొదటి పేజీ తరువాయి భాగం...

స్థాయిలో కూడా తక్షణమే అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని, 18లోగా పూర్తి చేయాలన్నారు. సర్పంచ్‌ల ద్వారా గ్రామాలలో ఎవరెవరు దృష్టి లోపంతో బాధపడుతున్నారో వివరాలు తీసుకుని అందరూ కవరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీలలో కూడా చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో తప్పనిసరిగా ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. కంటి వెలుగు కార్యక్రమంపై మండల, గ్రామస్థాయిలో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు, హోర్డింగులు, కరపత్రాల ద్వారా ప్రచారం కల్పించాలని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, గిరిజన కార్పోరేషన్ ఛైర్మన్ వాల్యానాయక్, జడ్పీ వైస్ ఛైర్మన్ కోడుగల్ యాదయ్య, మున్సిపల్ ఛైర్మన్ దోరెపల్లి లక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**ఉద్యమంలో కవుల పాత్ర కీలకం :** తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారుల పాత్ర కీలకమని, వారి రచనలు, పాటలు, కవితల ఆధారంగా ఉద్యమం మరింత ముందుకు సాగిందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. జడ్చర్లలోని ప్రేమ్ రంగా గార్డెన్‌లో గురువారం నిర్వహించిన జానకిరామం పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోషల్ మీడియా ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. మంచి, చెడును గుర్తించి నిస్వార్థంగా సేవలు చేసే రాజకీయ నాయకుల వెంట నడవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ యాదయ్య, జాతీయ సాహిత్య పరిషత్ పట్టణ అధ్యక్షురాలు పద్మలీల, ప్రధాన కార్యదర్శి కిరణ్మయి, పుస్తక రచయిత జానకి రాములు, సభాధ్యక్షులు సాకేత్ ప్రవీణ్, సీనియర్ సివిల్ జడ్జి ప్రభాకర్, మార్కెట్ కమిటి ఛైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, సంగీత నాటక అకాడమి మాజీ ఛైర్మన్ బాద్మి శివకుమార్, కౌన్సిలర్లు, హుడా డైరెక్టర్లు పాల్గొన్నారు.

# అధికారమా.. అహంకారమా..!

మొదటి పేజీ తరువాయి భాగం...

ఆ అధికారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం కల్పించిన పనులు నిర్వహించిన ఆ పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికి ఈ అధికారి మాత్రం బిల్లులను సర్పంచ్‌ల ఖాతాల్లోకి జమ చేయడానికి సర్పంచ్‌లను అనేక ఇబ్బందులు పెడుతున్నారని సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు సర్పంచ్‌లకు న్యాయం చేయాలని కోరిన సమయంలో ప్రజా ప్రతినిధులపై దురుసుగా ప్రవర్తించడంతో ఆ అధికారిపై మండల ప్రజా ప్రతినిధులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అరకొర బిల్లులు రావడం వల్ల చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక సర్పంచ్‌లు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉంటే సంగట్లో సడేమియ్యాగా ఆ అధికారి నిర్వాకం వల్ల సర్పంచ్‌ల గోడు పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

**మహిళా ఉద్యోగులపై వేధింపులు..**

గతంలో కొన్ని సార్లు మండలంలో సమావేశాలు నిర్వహించిన సందర్భాల్లో మహిళ ఉద్యోగుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నాడంటూ పలువురు ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో తన కార్లలోనే రావాలంటు మహిళా కార్యదర్శులకు హుకుం జారీ చేయగా ఇట్టి విషయాన్ని జెడ్పీ సీఈఓ దృష్టికి తీసుకెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. తాను చెప్పినట్లు వినాలని, లేదంటే వేధింపులకు గురి చేస్తూ నిత్యం మానసిక ఆందోళనకు గురి చేస్తున్నాడని పలువురు వాపోతున్నారు.

**ఈజీఎస్ కార్యాలయం ఖాళీ...**

సదరు అభివృద్ధి అధికారి వ్యవహార శైలితో విసిగిపోయిన ఉపాధి హామీ సిబ్బంది చాలా వరకు సెలవులు, బదిలీలపై వెళ్లడం గమనార్హం. గతంలో వంగూరు మండలంలో పనిచేసిన టీఎలు ఆ అధికారి వేధింపులు భరించలేక వాగ్వాదానికి దిగి చివరకు సెలవులపై వెళ్లి బదిలీలు చేయించుకొని వెళ్లిపోయారు. ఫీల్డ్ అసిస్టెంట్లు సైతం నిత్యం ఏదో ఒక విధంగా వేదనకు గురి చేస్తున్నాడని పలువురు ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారు.

**ప్రజా ప్రతినిధులంటే లెక్కే లేదు...**

గతంలో మండలంలో ఎంపీడీఓలుగా పనిచేసిన అధికారులు మండల నాయకులతో నేటికి సత్సంబంధాలు కొనసాగిస్తున్నా రు. కానీ ప్రస్తుత ఎంపీడీఓ సర్పంచ్‌లకు, ప్రజా ప్రతినిధులకు ఎలాంటి గౌరవం ఇవ్వకపోగా అసభ్యకరంగా, అగౌరవంగా మాట్లాడుతూ నిత్యం వివాదాలకు కారణమవుతున్నాడు. పలువురు సర్పంచ్‌లు ఈజీఎస్ బిల్లుల గురించి గత కొంత కాలంగా ఎంపీడీఓను వేడుకుంటున్నారు. నేడు, రేపు అంటూ సదరు అధికారి కాలం వెల్లదీస్తూ చివరకు అధికార పార్టీ సర్పంచ్‌లు ఎంపీడీఓతో తీవ్ర వాగ్వాదం చోటు చేసుకున్నట్లు సమాచారం. ఇట్టి విషయమై ఎమ్మెల్యే గువ్వల బాలరాజు దృష్టికి తీసుకెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం.

**ఎంపీడీఓ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాడు.**

**సర్పంచ్ అక్కి లావణ్య ఎల్లగౌడ్**



నేను మండల పరిషత్ అధికారిణి అని,నేను చెప్పిందే వేదమంటూ గ్రామ పంచాయతీల్లో పర్యటిస్తూ సర్పంచ్‌లను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వంగూరు గ్రామ సర్పంచ్ అక్కి లావణ్య ఎల్లగౌడ్ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల్లో పనులు నిర్వహించిన వాటికి సంబంధించి బిల్లులు జారీ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తూ సర్పంచ్‌లను అవమానపరుస్తూ నానా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, ఈ అధికారిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయిందని, ఇలాంటి అధికారుల వల్ల గ్రామాభివృద్ధి కుంటు పడుతుందని, ప్రజాస్వామ్యంలో ఓట్లేసి గెలిపించిన ప్రజలకు గ్రామానికి న్యాయం చేయలేకపోతున్నామని ఆమె వాపోయారు. ఎన్నో ఆశయాలతో గ్రామాన్ని అభివృద్ధి చేయాలని ముందుకు వస్తే అధికారుల నిర్లక్ష్యం వల్ల గ్రామాభివృద్ధి చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రజా ప్రతినిధులంటే అధికారికి చిన్నచూపు...**

**సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి**



గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కార్యాలయానికి వెళ్లి నెలకొన్న సమస్యలను అధికారితో చర్చించడానికి వెళితే కూడా సర్పంచ్‌లకు గౌరవం ఇవ్వకుండా తనకు నచ్చినట్లే వ్యవహరిస్తూ ప్రజా ప్రతినిధులను అగౌర పరుస్తున్నారని సదరు అధికారిపై వెంకటాపూర్ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎంతో మంది అధికారులు విధులు నిర్వహించారు కానీ ఇలాంటి అధికారిని ఎక్కడ చూడలేదని ఆయన పేర్కొన్నారు.

## ఏఐసిసి ప్రత్యేక సమావేశానికి జిఎంఆర్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జనవరి 12 ప్రభాతవార్త :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఏఐసిసి ఇంఛార్జి మాణిక్‌రావుథాక్రే జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులతో గాంధీ భవన్‌లో గురువారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జి. మధుసూదన్‌రెడ్డి (జిఎంఆర్) ఈ సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జిగా నియమితులైన మాణిక్‌రావు థాక్రేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు.


మాణిక్‌రావు థాక్రేను సన్మానిస్తున్న జి.మధుసూదన్‌రెడ్డి

## ఘనంగా రైతుల దినోత్సవం..

**వనపర్తి టౌన్,జనవరి 12 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలోని లిటిల్ బడ్స్ హై స్కూల్ లో ఆవరణలో లిటిల్ బడ్స్ మార్కెట్ యార్డ లో గురువారం ఘనంగా రైతుల దినోత్సవాన్ని జరుపుకున్నారు.ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం వరకు ఈ వేడుకలు కొనసాగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మెన్ గట్టు యాదవ్ పాల్గొన్నారు.పిల్లల దగ్గర కూరగాయలు, పండ్లు కొన్నారు. మకరసంక్రాంతి పండుగ పురస్కరించుకోని విద్యార్థులు తెచ్చుకున్న తాజాకూరగాయలు,పండ్లు, చికెన్, అవసరమైన గృహ అవసరాలను ఈ సందర్భంగా విక్రయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో కూరగాయాలు కొంటున్న మున్సిపల్ చైర్మెన్ గట్టు యాదవ్

## మాణిక్‌రావు థాక్రేను కలసిన కొండ ప్రశాంత్‌రెడ్డి

**దేవరకద్ర,జనవరి 12 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రానికి బుధవారం రాత్రి మొదటిసారి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు థాక్రేను దేవరకద్రకు చెందిన టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండ ప్రశాంత్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు మర్యాదపూర్వకంగా కలిసి ప్రశాంత్‌రెడ్డి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించారు. అలాగే కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బోస్‌రాజు,అలంపూర్ మాజీ ఎమ్మెల్యే,ఏఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్,మాజీ మంత్రులు గీతారెడ్డి,ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలను ప్రశాంత్‌రెడ్డి కలసి పార్టీ అంతర్గత విషయాలపై చర్చించారు.


మాణిక్‌రావు థాక్రేకు పుష్పగుచ్చం అందజేస్తున్న కొండ ప్రశాంత్‌రెడ్డి

## ఈవిఎంల భద్రత మరింత కట్టుదిట్టం చేయాలి

మొదటి పేజీ తరువాయి భాగం...

మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల అధికారి తెలంగాణ హైదరాబాద్ ఆదేశానుసారం కొత్త ఈవిఎంలు హైదరాబాద్ ఈసిఎల్ నుంచి జిల్లాకు రావడం జరిగిందన్నారు. జిల్లాకు (1071) బ్యాలెట్ యూనిట్లు, (837) కంట్రోల్ యూనిట్లు మొత్తం (1908) జిల్లాకు వచ్చాయన్నారు. ఈవిఎంల సంఖ్యను హాజరైన రాజకీయ పార్టీనిధుల సమక్షంలో చేయించి భద్రపరచాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్, ఆర్డీఓ రాములు, గద్వాల తహసిల్దార్ వెంకటేష, ఉండవెల్లి తహసిల్దార్ బద్రప్ప, సూపరింటెండెంట్ వరలక్ష్మి, రాజు, ఆర్ఐ వెంకటేశ్వర్‌రెడ్డి, సిపిఐ వెంకటస్వామి, ఆర్టీపి రెహమాన్, కాంగ్రెస్ ఇసాక్, టిఆర్ఎస్ మురళి తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

## సకాలంలో 100% పన్ను వసూలు చేయాలి : వనపర్తి అదనపు కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్


సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్, మున్సిపల్ ఛైర్మన్ గట్టు యాదవ్, వైస్ ఛైర్మన్ వాకిటి శ్రీధర్

**వనపర్తి టౌన్, జనవరి 12 ప్రభాతవార్త:** మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో మున్సిపాలిటీ పరిధిలోని అమలవుతున్న కార్యక్రమాలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో అవసరమైన చోటా ట్రాన్స్ఫార్మర్ లను మీటర్ కనెక్షన్ లను ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. కన్యకాపరమేశ్వరి దేవాలయం, మీజద్, కళికమాత, వీరాంజనేయ దేవాలయలకు సంబంధించిన రోడ్ల విస్తరణ పనులలో ఎలాంటి పొరపాట్లకు తవ్వికుండా పూర్తి చేయాలని అన్నారు. ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు. రోడ్ల విస్తరణ పనులలో భాగంగా ఇండ్లు కోల్పోయిన వారికి రెండు పడకల గదుల మంజూరీపై లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో శ్రీరామ థియేటర్ పరిసర ప్రాంతంలో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆయన మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. టౌన్ హాల్ పరిధిలోని సీసీ రోడ్డు నిర్మాణం పనులను వేగవంతం చేయాలని ఆయన అన్నారు. మున్సిపాలిటీకి సంబంధించిన ఆస్థి పన్ను వివిధ రకాల పన్నులను సకాలంలో వసూలు చేసి 100% పూర్తి చేయాలని ఆయన తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో చేపట్టిన చెత్త సేకరణ పనులలో భాగంగా తడి, పొడి చెత్త వేరు చేయాలని ఆయన సూచించారు. సేకరించిన చెత్తను జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు సెగ్రిగేషన్ షెడ్ కు తరలించాలని ఆయన తెలిపారు. రోడ్ల విస్తరణలో భాగంగా పట్టణంలోనిగాంధీ చౌక్ నుండి జమ్మి చెట్టు వరకు , గాంధీ చౌక్ నుండి శ్రీరామ థియేటర్ వరకు, శ్రీరామ థియేటర్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు విద్యుత్ ట్రాన్స్ఫర్మర్ పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన పనులలో జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలని ఆయన ఆదుశించారు. కార్యక్రమంలో ఓఎస్డీ పూర్ణచందర్, మున్సిపాలిటీ చైర్మెన్ గట్టు యాదవ్, వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్, విద్యుత్ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పక్కా ప్రణాళికతో కంటి వెలుగు

- నాలుగు టీంలతో ప్రత్యేక కంటి వెలుగు
- మండల ప్రజలు తప్పనిసరిగా వినియోగించుకోవాలి: ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్

**బిజినేపల్లి, జనవరి 12 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఆరోగ్య సంక్షేమ కార్యక్రమంలో భాగంగా ఈనెల 18 నుండి నిర్వహిస్తున్న ప్రత్యేక కంటి వెలుగు కార్యక్రమాన్ని బిజినేపల్లి మండలంలో పక్కా ప్రణాళికతో నిర్వహించాలని గురువారం మండల పరిషత్ సమావేశ హాల్లో నిర్వహించిన ప్రత్యేక కంటి వెలుగు సమావేశంలో మండల పరిషత్ అధ్యక్షులు పి. శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఈనెల 18నుండి నాలుగు కంటి వెలుగు టీంలతో ప్రత్యేకంగా కంటి శిబిరాలను నిర్వహిస్తున్న ట్లు ఆయన తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బిజినేపల్లి, లట్టుపల్లి, పాలెం పరిధిలోని అన్ని గ్రామాలలో, గిరిజన తండాలలో ఈనెల 18 నుండి 100 పని దినాళలో జూన్ మొదటి వారం వరకు ప్రత్యేకంగా కంటి వెలుగు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 18న బిజినేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఒక టీం ద్వారా మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నారని, లట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని లట్టుపల్లి రైతువేదిక కార్యాలయ ఆవరణలో పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని రెండు టీంల ద్వారా పాలెం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో,గుడ్లనర్వ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రత్యేక కంటి వెలుగు శిబిరాలను నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. ప్రతి టీంలో వైద్య బృందం కంటి పరీక్షలు నిర్వహించడానికి వైద్యులు, ఆప్తమెట్రిస్టు వివరాల సేకరణకు డాటా ఎంట్రీ ఆపరేటర్ సంబంధిత మహిళ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉండి ప్రతి శిబిరంలో 18 ఏళ్ల పైబడిన వారికి కంటి పరీక్షలు నిర్వహించి, వెంటనే వివరాలు అంతర్జాలంలో నమోదు చేయుట, అందుబాటులోని అర్హులైన అందరికి కంటి అద్దాలు, సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. ప్రత్యేక అవసరాలు, శస్త్ర చికిత్సలు అవసరం ఉన్నవారిని గుర్తించి, ఆన్‌లైన్‌లో నమోదు చేసి త్వరలో వారికి అద్దాలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. మండల ప్రజలు వైద్యారోగ్య శిబిరాలను వినియోగించుకుని, వారికి సహకరించాలని ఆయన కోరారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు శిబిరాలను తరచుగా పరిశీలించాలని శిబిరాలలో ఎంపిక చేసిన వారిని ఆరోగ్య సేవలు పొందే విధంగా ప్రోత్సహించాలనిఆయన కోరారు. శిబిరం నిర్వహించే ముందు రోజు గ్రామంలో గుర్తించిన వారిని వైద్యారోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఆహ్వాన పత్రికలు అందించి,గ్రామ, గిరిజన వాసులను శిబిరానికి ఆహ్వానించాలని ఆయన సూచించారు. ప్రజారోగ్య సంక్షేమ కార్యక్రమాన్ని ప్రతినిధులు గ్రామ అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, యువత, మహిళా సంఘాలు, గ్రామ అధికారులు, అంగన్‌వాడి సిబ్బంది, ఉపాధ్యాయుల గ్రామాలలో ప్రజలను ప్రోత్సహించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కృష్ణయ్య, తహసిల్దార్ అంజిరెడ్డి, వైద్యాధికారులు డా. బి శ్రీకాంత్, డా. ఎం. శివకుమార్, డా.బి. ఆలోచన, డా.బి. తేజస్విని, మండల విద్యాశాఖ అధికారి భాస్కర్‌రెడ్డి, ఆరోగ్య విస్తీర్ణాధికారులు పోల శ్రీధర్, బాదం రాజేశ్వర్, వై. శ్రీనివాసులు, మండలంలోని మండల ప్రాదేశిక సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో 2కే రన్


2కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**కల్వకుర్తి, జనవరి 12, ప్రభాతవార్త:** యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద అని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. వివేకానంద 160వ జయంతిని పురస్కరించుకొని గురువారం కల్వకుర్తి పట్టణంలో డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, డీఎస్పీ గిరిబాబు, కల్వకుర్తి, వెల్దండ సీఐలు సైదులు, రామకృష్ణలు ముఖ్య అతిథులుగా హాజరై 2కే రన్‌ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత వివేకానందుని అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయాలను యువతను సాధించాలని ఆయనఅన్నారు. విద్యావంతులను సమాజ సేవకు అంకితం చేశారని ఆయన కొనియాడారు. భారతీయ సంప్రదాయం, గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పి ఈ దేశంలో కులాల పేరుతో వెట్టిచాకిరి, వివక్షత చూయించడాన్ని తీవ్రంగా ఖండించారని ఆయన సూచించారు.వివేకానందున్ని స్ఫూర్తిగా తీసుకొని యువతముందు కెళ్లాలని, జీవితంలో ఎదురయ్యే చిన్న చిన్న వైఫల్యాల వల్ల ఆత్మస్థైర్యం కోల్పోవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సామ మనోహర, వైస్ ఎంపీపీ కొండూర్‌గోవర్ధన్, పార్టీ అధ్యక్షులువిజయ్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ షాహేద్, కౌన్సిలర్లు ఏజాస్,గోరటి శ్రీనివాస్,వైద్యులు శివరాం, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బావండ్ల మధు, మిత్ర ఫౌండేషన్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## వనపర్తి వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగకు అత్యధిక ధర



**వనపర్తి టౌన్, జనవరి 12 ప్రభాతవార్త:** వనపర్తి వ్యవసాయ మార్కెట్‌కు వేరుశనగ చిన్నంబావి మండలం కాలూరు గ్రామానికి చెందిన రైతు సోలీపూర్ రామకృష్ణ పండించిన వేరుశనగ కు అత్యధిక రేటు రూ.9419 వన పర్తి మార్కెట్‌లో అత్యధిక ధర పలకడం గర్వకారణం అందుకు గానుపల్లి పండించిన రైతును గర్వంగా పొగుడుతూ వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ పలుస రమేష్ గౌడ్ రైతులకు స్వీట్లు పంచిపెట్టారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలంగాణ రైతుల కొరకు పంటలు పండించానికి ప్రాజెక్టుల ద్వారా వ్యవసాయ రంగానికి నీరు తీసుకువచ్చి రైతులు రాజులు కావాలని అహర్నిశలు కృషి చేశారని అన్నారు. వనపర్తిలో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మార్కెట్ నిర్మించి రైతులకు అన్ని వసతులు కల్పించిరైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించడానికి మార్కెట్ లో జీరో వ్యాపారం జరగకుండా కష్టపడి సాధించుకున్న తెలంగాణలో రైతులకు మార్కెట్‌లో అన్యాయం జరగకుండా పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి నామీద నమ్మకంతో నన్ను చైర్మెన్ చేసిన మంత్రి నిరంజన్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ జి.పరంజ్యోతి, మార్కెట్ సెక్రటరీ లక్ష్మణ్‌గౌడ్, డీఎం సింగ్ లు ఉన్నారు.

## ప్రభుత్వ నిబంధనలకు లోబడే లే అవుట్ లకు అనుమతి ఇవ్వాలి: అదనపు కలెక్టర్


లేఅవుట్‌లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్, వేణుగోపాల్

**వనపర్తి ప్రతినిధి, జనవరి 12 ప్రభాతవార్త:** ప్రభుత్వ నిబంధనలకు లోబడే లే అవుట్‌లకు అనుమతి ఇవ్వాలని అదనపు కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్ అధికా రులను ఆదేశించారు. గురువారం వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని లే అవుటు లను జిల్లా కమిటీ సభ్యులతో కలిసి ఆయన పరిశీలించారు. ప్రభు త్వ నిబంధనల ప్రకారం లే అవుట్లలో అన్ని వసతులు 10%పార్కింగ్ భూమి ఏర్పాటు చేసేలా లే అవుట్లను అనుమతివ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, జిల్లా లే అవుట్ కమిటీ సభ్యులు తహసల్దార్ రాజేందర్ గౌడ్, పంచాయితీ రాజ్ ఈఈ మల్లయ్య, రహదారుల భవనాలు, నీటిపారుదల ఈఈలు, మున్సిపాలిటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారి పాల్గొన్నారు.

## మద్యం తాగి లారీ నడిపిన డ్రైవర్‌కు జైలుశిక్ష

**దేవరకద్ర, జనవరి 12 ప్రభాతవార్త:** మద్యంతాగి లారి నడిపిన లారి డ్రైవర్‌కు 7 రోజుల జైలుశిక్ష పడింది. ఎస్ఐ భగవంతరెడ్డి కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. దేవరకద్రలో బుధవారం రాత్రి కనకదుర్గా దాబా వద్ద పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లారీ నడుపుతున్న తమిళనాడుకు చెందిన డ్రైవర్ మధుకు మద్యం తాగాడన్న అనుమానంతో తనఖీ చేయగా అతనికి 293 రేడియేషన్ వచ్చింది. దీంతో మధును అరెస్ట్ చేసి మహబూబ్‌నగర్ కోర్టులో ప్రవేశపెట్టగా అతడికి 7 రోజుల జైలుశిక్షతోపాటు 4వేల జరిమాన విధించినట్లు ఎస్ఐ భగవంతరెడ్డి తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**బిజినేపల్లి, జనవరి 12 ప్రభాతవార్త:** మండల కేంద్రానికి చెందిన దూల కాశమ్మ (65) అనే వృద్ధురాలు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం ఉదయం మృతి చెందింది. కుటుంబ పెద్దదిక్కును కోల్పోయిన బాధిత కుటుంబ సభ్యులకు మానవతా దృక్పదంతో తనవంతు సాయంగా మండల రైతు సమితి అధ్యక్షుడు నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి వారిని పరామర్శించి రూ. 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట మంగి మురళి, మంగి పెద్ద నరసింహ, రిజ్వాన్, కావలి అంజి తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలలో ముగ్గుల పోటీలు



**ఖిల్లాఘణపురం, జనవరి 12 ప్రభాతవార్త:** మండల కేంద్రం లోని ప్రభుత్వ జూని యర్ కళాశాల ఆవరణలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని గురవారం ముగ్గుల పోటీలను యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముగ్గుల పోటీలలో కళాశాల విద్యార్థినిల ఉత్సాహంగా పాల్గొన్నారు. యువతకు ఆదర్శంగా నిలిచే విధంగా ముగ్గులు వేసి పలువురు చేత ప్రశంసలు అందుకున్నారు. జాతీయ యువజన వారోత్సవాలు ఉట్టిపడేలా ముగ్గులను సుందరంగా వేశారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ చాటిన వారిలో మొదటి బహుమతి నాగలక్ష్మీ, రెండవ బహుమతి ప్రత్యూష, మూడో బహుమతి స్వాతి ఎంపికయ్యారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థినిలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు రాళ్ల కృష్ణయ్య, అడ్వకేట్ రామ్మోహన్, యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధు, కళాశాల ప్రిన్సిపల్ రాధ, లెక్చరర్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రూ.12లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో కమిటీ హాల్‌కు భూమిపూజ



**మదనాపురం, జనవరి 12 ప్రభాతవార్త:** మదనాపురం మండల కేంద్రంలోని గోవిందల్లి గ్రామంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సహకారంతో ఎస్‌డీఎఫ్ నిధులతో రూ.12లక్షల వ్యయంతో కూడిన కమిటీ హాల్‌కు జడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్, ఎంపీపీ పద్మావతమ్మ, మార్కెట్ యార్డ్ చైర్మెన్ శ్రావణ్ కుమార్‌రెడ్డి, సర్పంచ్‌శ్రీనివాసులుయాదవ్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యాదమ్మ, సింగిల్‌విండో వైస్ చైర్మెన్ చీర్ల శ్రీనివాసులు, మండల సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు చాంద్‌పాష, మూలమల్ల ప్రవీణ్ రెడ్డి, వెంకటనారాయణ, మండల సీనియర్ నాయకులు విష్ణు,పార్టీ నాయకులు,రమేష్,దళిత బంధు చైర్మెన్ శ్రీనివాసులు, ఎస్సీ సెల్ అధ్యక్షులు గనేపల్లి మనోజ్ కుమార్‌లు పాల్గొన్నారు.

## కంటి వెలుగుపై సమీక్షా సమావేశం



**వెల్దండ, జనవరి 12, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని, ఇట్టి కార్యక్రమం బృహత్తరమైన కార్యక్రమమని ఎంపీపీ విజయజైపాల్‌నాయక్, జెడ్పీటీసీ ధ్యాప విజితారెడ్డిలు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారన్నారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌లాల్, తహసీల్దార్ చంద్రశేఖర్, వైద్యాధికారి స్వరూపతో పాటు తదితరులు ఉన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఆరోగ్య భద్రత


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ

**కల్వకుర్తి, జనవరి 12, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలకు ఆరోగ్య భద్రతను అందిస్తుందని, ప్రభుత్వం సకాలంలో ఆర్థిక సహాయం అందించి ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపుతుందని ఆయన కొనియాడారు.కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామానికి చెందిన స్వప్నకు మంజూరైన రూ.48వేలు, సంధ్యకు మంజూరైన రూ.60వేలు, మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామానికి చెందిన శిరీషకు మంజూరైన రూ.31వేలు, సాయికుమార్‌కు మంజూరైన రూ.21వేలు, నాగిళ్ల గ్రామానికి చెందిన పి.అయోధ్యకు మంజూరైన రూ.20వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ తన నివాసంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోళి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సర్కార్ పేదల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యతనిస్తూ అన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్యశాలలను బలోపేతం చేస్తుందన్నారు. రాష్ట్ర రాజధానిలో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసిన పేదలకు మెరుగైన వైద్యం అందిస్తుందన్నారు. అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సకాలంలో ఆర్థిక సహాయం అందిస్తున్నామని, ఈ పథకం ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు తదితరులు ఉన్నారు.

# సంక్రాంతికి ఊరెళ్తున్నారా జరభద్రం!

- ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్లేవారు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి
- ప్రజలు అప్రమత్తంగా ఉండి కొత్తవ్యక్తుల కదలికలపై దృష్టి సారించాలి: వనపర్తి జిల్లా ఎస్పీ అపూర్వరావు



**వనపర్తి క్రైమ్, జనవరి 12 ప్రభాతవార్త:** తెలుగువారు అత్యంత వేడుకగా జరుపుకునే పండుగలలో సంక్రాంతి పండుగ ఒకటి ఈ పండుగకు బంధువులు, కుటుంబ సభ్యులు ఒకే దగ్గర చేరుకుని 3రోజులు పండుగ జరుపుకోవడం సంప్రదాయం. ఈ సంక్రాంతి పండుగకు కార్యాలయాలకు, విద్యా సంస్థలకు కూడా సెలవులు ఇవ్వడంతో అందరు తమ తమ స్వగ్రామాలకు వెళ్లి బంధువులతో కలిసి పండుగ సంతోషంగా జరుపుకుంటారు. ఇదే అవకాశంగా తీసుకొని కొన్ని దొంగల ముఠాలు తాలాలు వేసిన ఇళ్లను ముందుగా రెక్కీ చేసుకొని దొంగతనం చేయడానికి అనువైన ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడుతున్నారని ఊళ్లకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వనపర్తి ఎస్పీ అపూర్వరావు జిల్లా ప్రజలకు తెలిపారు. సంక్రాంతి పండగ దృష్ట్యా చోరీల నియంత్రణకు జిల్లాలో అన్ని చర్యలు చేపట్టామని ప్రజలను అప్రమత్తం చేస్తూ పట్టణాలలో,గ్రామాల్లో పకడ్బందీగా పలీసుల గస్తీ ఏర్పాటు చేశామని అన్నారు. పండగకు తమ స్వగ్రామాలకు వెళ్లేవారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండగకు ఇంటికి, ఊళ్లకు వెళ్లేవారు ముందుగానే తమ సమాచారిన్ని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని ఇంటికి తాళం వేసి వెళ్లే ముందు విలువైన వస్తువులు బంగారు ఆబరణాలు,ఎక్కువ మొత్తంలో నగదు, ఇంటిలో వదిలి వెళ్లద్దని ఎస్పీ సూచించా రు. ఇంటికి తాళం వేసి వెళ్లవలసి వస్తే ఎవరైనా తెలిసిన వారికి నమ్మకస్తులను కానీ దగ్గరబంధువులను ఇంట్లో పడుకునేవిధంగా ఏర్పాటు చేసుకోవాలని అన్నారు.పండగకు ఊళ్లకు వెళ్లేటప్పుడు ప్రయాణం చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కువ మొత్తంలో బంగారు ఆభరనాలను ధరించి బస్సుల్లో వెళ్లే సమయంలో రద్దీ వలన ఆభరణాలు దొంగతనానికి గురయ్యే అవకాశం ఉంటుందని అంతే కాకుండా బస్సు ఎక్కే సమయంలో దొంగలుచోరీ చేసే అవకాశం ఉందని బస్సు ఎక్కే సమయంలో పక్కన ఉన్నవారిని గమనిస్తూ బస్సు ఎక్కలని లేవంటే శరీరం మీద ఉన్న బంగారు ఆభరణాలను, బ్యాగులో ఉన్న వస్తులను దొంగతనం చేస్తారని అన్నారు. అనుమా నితులు, కొత్త వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కి గానీ, కంట్రోల్‌రూమ్ 0854521100 నెంబర్లకు లేదా సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సమాచారం అందించి దొంగ తనాలు జరగకుండా పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. ఎల్లప్పుడు ప్రజల రక్షణకు వనపర్తి జిల్లా పోలీసు ముందుటారని అన్నారు. జిల్లా ప్రజలందరికి కుటుంబ సభ్యులు,బంధువులతో కలిసి సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీఅపూర్వరావు జిల్లా ప్రజలందరికి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# క్రీడలలో గెలుపోటములు సహజం: గద్వాల జిల్లా ఎస్పీ


కబడ్డీ నిర్వాహకులతో జిల్లా ఎస్పీ, డీఎస్పీ

**ఇటిక్యాల, జనవరి 12 ప్రభాతవార్త:** క్రీడలలో గెలుపోటములు సహజమేనని క్రీడాకారులు సోదరభావంతో ఉంటూ క్రీడలు ఆడుకోవాలని జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ రంజన్ రతన్‌కుమార్ అన్నారు. గురువారం ఓపెన్ టు ఆల్ కబడ్డి పోటీలను సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో కొండేరు గ్రామనకి చెందిన పోతురాజు సోమనాద్రి విదేశాలలో స్థిరపడిన ఆయన తల్లి జ్ఞాపకార్థం పోతురాజు శంకరమ్మ సేవాదళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కబడ్డి క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఎస్పీ రంజన్ రతన్ కుమార్, డీఎస్పీ రంగస్వామి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సంక్రాంతి పండగ సందర్భంగా క్రీడా పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు. అదేవిధంగా రెండు రోజులపాటు జరిగే కబడ్డి క్రీడా పోటీలను ప్రశాంతంగా జరుపుకోవాలని క్రీడా పోటీలను నిబంధనల ప్రకారం నిర్వహించుకోవాలని ఆదేశించారు. ఓపెన్ టు ఆల్ కబడ్డి పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక మూడు ప్రాంతాల నుండి సుమారు 65 కబడ్డి జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు నాగరాజు యాదవ్, అబ్దుల్లా, దశరథం సాగర్, అశోక్, మధుసూదన్‌గౌడ్, సంపత్,అంజి,అశోక్, సర్పంచ్‌లు రవి, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

## వీరాంజనేయ స్వామి కలశ ఊరేగింపు

**ఖిల్లాఘణపురం, జనవరి 12 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జల్లా గట్టుపై వెలసిన వీరాంజనేయ స్వామి మాలధారణ భక్తులు గురువారం గ్రామంలోని పురవీధుల గుండా కలశ ఊరేగింపు చేశారు. వీరాంజనేయ భక్తులు కలశాన్ని ఊరేగిస్తూ అఖండ బజలను చేస్తూ జై శ్రీరామ్ నినాదాలతో గ్రామంలో మారుమోగించారు. ఆంజనేయ స్వామి శ్రీరాయుడు లభారీ విగ్రహాలను ట్రాక్టర్ ట్రాలీలతో ఊరేగిస్తూ భక్తి తన్మయత్వంతో చిందులేశారు. సంక్రాంతి పర్వదిన ముందు రోజుల్లో కలశ ఊరేగింపు చేయడం గత కొన్ని సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తుందని భక్తులు తెలిపారు. బెస్తగిరి ఆంజనేయస్వామి ఆలయం నుండి ఊరేగింపు సాగింది. గ్రామంలోని పురవీధుల గుండా తిరుగుతున్న ఆంజనేయస్వామి భక్తులు వీరాంజనేయ స్వామి మాలాదారణ స్వాములకు నిండు కడవలతో జలాభిషేకాలు చేస్తూ ఆశీర్వాదం స్వీకరించారు. సంక్రాంతి పండుగ సందర్భాంగా జల్లా గట్టుపై బ్రహ్మోత్సవాలు నిర్వహించడానికి ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కలశ ఊరేగింపులో వందలాది మంది భక్తులు పాల్గొని కాషాయపు జెండాలు చేతబూని హర్షధ్వానాల మధ్య ఊరేగింపు విజయవంతం చేశారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



**కల్వకుర్తి, జనవరి 12, ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గంలోని కల్వకుర్తి, వెల్దండ, చారకొండ మండలాలకు సంబంధించిన 16 మంది సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం సహాయనిధి అంటే ఇంతకు ముందు ఎవ్వరికి తెలియదని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ సీఎం సహాయనిధి ధరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి కొంత ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, ఎంపీపీ సామ మనోహర, వెల్దండ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, వెల్దండగ్రామ సర్పంచ్ యెన్నంభూపతిరెడ్డి, వెల్దండ జెడ్పీటీసీ ధ్యాప విజితారెడ్డి, ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు చదువులో నైపుణ్యత పెంపొందించాలి



**ఇటిక్యాల, జనవరి 12 ప్రభాతవార్త:** విద్యార్థులు చదువులో నైపుణ్యత సాధించాలని అలాగే వారిలోని సృజనాత్మకతను వెలికి తీయాలని ఆ దిశగా ఉపాధ్యాయులు మంచి బోధన అందించాలని జోగులాంబ గద్వాల జిల్లా జడ్పీ సీఈఓ విజయనాయక్ అన్నారు. గురువారం మండల పరిధ జలోని ఆర్గార్లపాటు గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలను సంద ర్శించారు. అదేవిధంగా మన ఊరు మనబడి పథకం కింద కొనసాగు తున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువు కుంటున్న విద్యార్థులను వారి సామర్థ్యాలపై అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట ఎంపిడిఓ రాఘవ,హెచ్ఎం కరేంద్రనాథ్, ఎంపిటిసి మల్లేష్, పంచాయతీ కార్యదర్శి భాష తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ



**గండీడ్, జనవరి 12 ప్రభాతవార్త:** తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం గండీడ్ మండల శాఖ తరపున గురువారం ఎంపిడిఓకార్యాలయంలో ఉపేందర్‌రెడ్డి చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం మహబూబ్‌నగర్ శాఖ ప్రధాన కార్యదర్శి హీరాలాల్ రాథోడ్, మండల అధ్యక్షులురవిందర్‌నాయక్, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, విఠల్, గేమ్యానాయక్, ధర్మ నాయక్ మండలంలోనిప్రాథమిక సభ్యులు, మండలసూపరింటెండెంట్,స్టాఫ్ పాల్గొన్నారు.

# రామరాజ్యంతో తెలంగాణ అభివృద్ధి

- కల్వకుంట్ల కుటుంబ మాయమాటలతో మరోసారి మోసపోవద్దు
- 100 కోట్లతో కవితమ్మ లిక్కర్ దందా
- కొల్లాపూర్‌లో ఎగిరేది కాషాయపు జెండా
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 12, ప్రభాతవార్త:** త్యాగల పునాదులపై ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని కల్వకుంట్ల కుటుంబం దోచుకుంటూ ప్రజలను మోసం చేస్తూ సొంత ఖజానా పెంచుకుంటూ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రామరాజ్యాంతోనే సాధ్యమవుతుందని, రానున్న ఎన్నికల్లో తెలంగాణ గడ్డపై కాషాయపు జెండా ఎగరడం ఖాయమని, దొరల పాలన అంతమొందడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. కుటుంబ పాలనతో తెలంగాణ రాష్ట్రాన్ని అవినీతి, అక్రమాలకు అడ్డగా మారుస్తున్న కేసీఆర్ పాలనను అంతమొందించేందుకు బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు ఎల్లేని సుధాకర్ చేపట్టిన పాదయాత్ర ముగింపు సభకు ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో అమాయక ప్రజల ప్రాణాలు పణంగా పెట్టి సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని కల్వకుంట్ల కుటుంబం తన గడిలలో బంధించి గడీల తెలంగాణగా మార్చి రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజలను అభివృద్ధికి అమడ దూరంలో ఉంచి మరోసారి గద్దెనెక్కేందుకు కల్వకుంట్ల కుటుంబం చెప్పే మాయమాటలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఇండ్లు లేక అవస్థలు పడుతున్నారని,తెలంగాణ రాష్ట్రానికి 2.40 లక్షల ఇండ్లు మంజూరు చేస్తే కేసీఆర్ కుటుంబం పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను అందించకుండా కాలయాపన చేస్తూ పేదోడిగృహ కల్పనకు అడ్డంకిగా మారారన్నారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి కల్వకుంట్ల కుటుంబం చేస్తున్న అవినీతి, అక్రమాలను ఎండగట్టేందుకు కేంద్ర ప్రభుత్వం దేగకన్ను పెట్టిందని, త్వరలోనే కల్వకుంట్ల కుటుంబం చేత ఊసలు లెక్కబెట్టిస్తామని ఆయన హెచ్చరించారు. ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర ఖజానా లేదు కానీ ఎమ్మెల్సీ కవితకు లిక్కర్ దందా చేయడనికి రూ.100కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఎమ్మెల్సీ కవిత ఢిల్లీలో చేపడుతున్న లిక్కర్ దందాపై విచారణ చేపడితే తెలంగాణ ఆడపడుచులను అవమానపరుస్తారా అని ప్రగల్భాలు పలుకడం సమంజసమా అని ఆయన ప్రశ్నించారు.తెలంగాణ ఆడపడుచులు సంప్రదాయానికి ఆకట్టుకునేలా ఉండాలి కానీ లిక్కర్ స్కాంలు చేయడం తెలంగాణ ఆడపడుచుల సాంస్కృతాని ఆయన ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గంలో కాషాయపు జెండాను ఎగురవేసి ఈ ప్రాంత అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. ఎల్లేని సుధాకర్ తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అక్రమాలను ఇప్పటికే ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్యవంతులుగా చేస్తున్నారని, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పర్చేందుకు కేంద్ర ప్రభుత్వం సోమశీల కృష్ణా నదీపై వంతెనను నిర్మించి తిరుపతికి వెళ్లే భక్తులకు సుమారు 80 కిలోమీటర్లు తగ్గించి కొల్లాపూర్ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మార్చేందుకు నిధులు మంజూరు చేసిందని ఆయన తెలిపారు. కొల్లాపూర్ ప్రాంతానికి రైల్వే మార్గాన్ని ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్

## సింగిరెడ్డి తారకమ్మ జ్ఞాపకార్థంగా వనపర్తిలో ప్రారంభమైన జాతీయ స్థాయి క్రికెట్ టోర్నమెంట్

- క్రీడలను ప్రారంభించిన మంత్రి కుమార్తె సింగిరెడ్డి ప్రత్యూష
- పాల్గొనున్న 16జట్లు..ఈనెల 16న ముగింపు
- ప్రథమ విజేతకు రూ.1.50లక్షలు, ద్వితీయ విజేతకు రూ.75వేల నగదు బహుమతులు

**వనపర్తి ప్రతినిధి, జనవరి 12 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో గురువారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డినిరంజన్ రెడ్డి తల్లి సింగిరెడ్డి తారకమ్మ పేరుతో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను మంత్రి కుమార్తె సింగిరెడ్డి ప్రత్యూష ప్రారంభించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహిస్తున్న జాతీయ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన 16 క్రికెట్ టీం లు తమ పేర్లను నమోదు చేసుకున్నాయి. ఈనెల 16వరకు టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఎస్ఎన్ఆర్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఈ క్రీడల్లో గెలుపొందిన మొదటి విజేతకు షీల్డ్ తో పాటు రూ.1.50లక్షల నగదు బహుమతి రెండవ విజేతకు రూ.75వేల నగదు బహుమతి, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, సిరీస్ మ్యాచ్ ఆఫ్ ద మ్యాచ్ లకు రూ.30వేలు నగదు బహుమతి ఇవ్వడం జరుగుతుందని ముగింపు క్రీడలకు వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరుకానున్నారని సింగిరెడ్డి ప్రత్యూష తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ గట్టు యాదవ్, వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్, మార్కెట్ కమిటీ చైర్మెన్ రమేష్ గౌడ్, కౌన్సిలర్లు నాగన్న యాదవ్, పుట్టపాకుల మహేష్, తదితరులు ఉన్నారు.




బ్యాటింగ్ చేసి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సింగిరెడ్డి ప్రత్యూష

## అదుపు తప్పి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుబోల్తా

**మూసాపేట,జనవరి 12 ప్రభాతవార్త :** మూసాపేట మండల కేంద్రంలోని దావత్ హోటల్ సమీపంలో హైదరాబాద్ నుండి బెంగుళూరు కెఎ 51 ఎహెచ్ 5395 నంబర్ గల ప్రైవేట్ ట్రావెల్ బస్సు గురువారం అర్థరాత్రి రెండు గంటలకు రోడ్డు పక్కల రిపేర్ అయిన టాటా ఏసీ ఆటోను తప్పించబోయి బోల్తా పడింది. బోల్తా పడిన ఘటనలో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిలో స్వారిక విశ్వాస్ (26), దివ్యకుమారి (28), షబానా పర్వీన్ (28), నూర్‌మొహ్మద్ (52), అమీర్ (7), మహీర్ (6), కేశవమూర్తి (53)లు కాగా గాయపడిన వారంతా బెంగుళూరుకు చెందన వారిగా ఎస్సై నరేష్ తెలిపారు.

## కనిమెట్టలో బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరిక

**కొత్తకోట,జనవరి 12 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కనిమెట్ట గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన 80 మంది కార్యకర్తలు ఎంపీపీ గుంత మౌనిక ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి గురువారం బీఆర్ఎస్ పార్టీలె చేరారు. ఆ గ్రామ సీనియర్ కాంగ్రెస్ నాయకులు మంద కృష్ణ కుమార్ ను పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లా చేరుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆ గ్రామం ఇప్పటికే 95% బీఆర్ఎస్ పార్టీలో చేరారని, పాత, కొత్త తేడా లేకుండా పార్టీ బలోపేతం కోసం పార్టీ శ్రేణులు పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మెన్ వామన్ గౌడ్, సీడీసీ చైర్మెన్ చెన్నకేశవ రెడ్డి, మార్కెటన కమిటీ చైర్మెన్ శ్రావన్ కుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ వడ్డె శ్రీనివాసులు, ఉమ్మడి జిల్లాల అధికార ప్రతినిధి ప్రశాంత్, గుంత మల్లేష్, పరమేష్, కోటేశ్వర్ రెడ్డి, లావణ్య, చంద్రకళ, దేవి తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవ్వాలి: జిల్లా బిజెపి అధ్యక్షుడు

**ఇటిక్యాల,జనవరి 12 ప్రభాతవార్త:** ఈ ఏడాదిలో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు బిజెపి నాయకులు, కార్యకర్తలు సిద్దంగా ఉండాలని జోగులాంబ గద్వాల జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని షాబాద గ్రామంలో 43,44 పోలింగ్ బూతుల అధ్యక్షులతో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అదేవిధంగా స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్‌పై అలాగే బారాసా పార్టీపై ప్రజలు విసుగు చెందారని కెసిఆర్ ఇప్పటికే ఎన్నో హామీలు ఇచ్చారని అవి హామీలుగానే మిగిలిపోయాయని,2003లో తెలంగాణరాకముందు టిఆర్ఎస్ పార్టీ పెట్టి మొట్ట మొదటి పాదయాత్ర జోగులాంబ అమ్మవారి నుండి మొదలుపెట్టి ఎన్నో హామీలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని, కుర్చీ వేసుకుని కూర్చుంటానని రైతులను నమ్మబలికారని కాని ఇప్పుడు ఆంధ్ర పాలకులు నీరు దోపిడి చేస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. అదేవిధంగా నెట్టెంపాడు ప్యాకేజీ 99,100ప్యాకేజీ కాలువలో కనీసం గంప మట్టి తీసిన పరిస్థితి లేదని ఇంతవరకు కెసిఆర్ ప్రభుత్వం ఏర్పడే ఎనిమిదేళ్లవుతున్నా తెలంగాణ అభివృద్ధి చెందలేదని అంతే కాకుండా ఎక్కడ రోడ్లు, పాఠశాలలు, విద్యుత్ సబ్ స్టేషన్లు, ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు మెరుగుపడలేదని అలాగే ఇతర అభివృద్ధి పనులు జరగలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రధానమంత్రి పశువులు భీమా యోజనను అడ్డుకోవడం జరిగిందని, రైతులకు ఉపయోగపడే ఇతర పరికరాలు రావడం లేదని పూర్తిగా రైతులకు రుణమాఫీ చేయలేదని ఉచిత కరెంటు, ఉచిత ఎరువులు లేవని 2018 ఎన్నికల ముందు కెసిఆర్ ప్రగల్భాలు పలికారని ఆర్భాటాలు తప్ప కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం లేదని తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా పూర్తిస్థాయిలో రైతులకు సాగు నీరు అందడం లేదని, రైతులను, ప్రజలను కెసిఆర్ ప్రభుత్వం మోసం చేస్తూనే ఉందని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కెకె రెడ్డి, బిజెవైఎం రాష్ట్ర నాయకులు తిరుమలరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జగదీష్‌రెడ్డి, పోలింగ్ బూత్ అధ్యక్షులు సత్యారెడ్డి, సురేష్, పరశురాం, కృష్ణ, శివశేఖర్, రామకృష్ణ, ఈదన్న, మధు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత రక్తదాన శిబిరం విజయవంతం

**బిజినేపల్లి,జనవరి 12 ప్రభాతవార్త:** జాతీయ యువజన దినోత్సవం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని గురువారం మహదేవునిపేట గ్రామంలో నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిర విజయవంతమైందని ఎద్దుల రాజేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మహదేవునిపేట గ్రామంలో ప్రతిఏటా స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా ఉచిత రక్తదాన శిబిరం నిర్వహిస్తూ ఎందరికో రక్తదానం అందించి ప్రాణదాతలుగా నిలుస్తున్నారని గ్రామ యువకులను కొనియాడారు. రక్తదాన శిబిరంలో సర్పంచ్ ఎద్దుల కళ్యాణి ఎంపిటిసి సభ్యురాలు రాధా రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా సెక్రెటరీ సి.రమేష్‌రెడ్డి, తహసిల్దార్ అంజిరెడ్డి, ఎస్సై కృష్ణ ఓబుల్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ కళాయణి, ఎంపిటిసి సభ్యురాలు జి.రాధ, రెడ్‌క్రాస్ ఎంసి మెంబర్ కృష్ణారావు, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డా.రోహిత్‌కుమార్, ఈవెంట్ ఆర్గనైజర్ మల్లికార్జున్, వివేకానంద యువజన సంఘం సభ్యులు, మహాదేవ యువజన సంఘం సభ్యులు, గ్రామ పెద్దలుజి.తిరుపతిరెడ్డి, కె.నారాయణచారి, ఎ.సుధాకర్‌రెడ్డి, ఎస్.శివశంకర్, ఎ.హరీష్‌రెడ్డి, ఎన్.స్వామి, జి.బాలస్వామి, యు.కృష్ణ, సి.సత్యనారాయణ, జి.అంజి,ఎ.నరెందర్‌రెడ్డి, జి. శ్రీనివాస్‌రెడ్డి, రామస్వామి,కె.చందు, జె.రాములు, ఎన్. నాగరాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

## బీచుపల్లి ఆంజనేయస్వామి హుండీ లెక్కింపు

**ఇటిక్యాల,జనవరి12 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బీచుపల్లి పుణ్యక్షేత్రంలో గల ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులు వేసిన హుండీ లెక్కింపును దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వరమ్మ, ఆలయ ఈఓ ఉమారాణి ఆధ్వర్యంలో గురువారం ఆలయంలో ఆలయ సభ్యులు, దేవాలయ సిబ్బంది గద్వాలకు చెందిన 40 మంది మహిళా భక్తులు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. రెండు రోజులపాటు లెక్కించగా ఆలయానికి 44 లక్షల 16 వేల 58 ఆదాయం వచ్చినట్లు దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులు తమ కానుకలు హుండీలో వేసినట్లయితే స్వామివారికి జరిగే కైంకర్యాలు, సేవలు పొందుటకు వీలుంటుందని దేవాలయ నిర్వాహకులు తెలిపారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**అడ్డాకుల,జనవరి 12 ప్రభాతవార్త:** అడ్డాకుల మండలం కన్మనూరు గ్రామానికి చెందిన మీసాల కురుమన్న (విఆర్ఎ)కు ఆర్థిక సాయం అందించిన మండల తహసిల్దార్ కిషన్‌నాయక్ బుధవారం అడ్డాకుల మండలం కన్మనూరు గ్రామానికి చెందిన మీసాల కురుమన్న అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న మండల తహసిల్దార్ కిషన్ నాయక్ మీసాల కురుమన్న పార్థీవ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలాగే మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటి తహసిల్దార్ శ్రీనివాసులు,గ్రామ సర్పంచ్ సుమతమ భీంరెడ్డి, ఉపసర్పంచ్, రాజావర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రూ.2లక్షల ఎల్ఓసీ అందజేత

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 12, ప్రభాతవార్త:** తెల్కపల్లి మండలం గౌరారం గ్రామానికి చెందిన ఊర మల్లేష్ గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నారు. ఆర్థిక పరిస్థితులతో మెరుగైన వైద్య చికిత్స చేయించుకోలేకపోవడంతో స్థానిక నేతలు ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే తన సిఫారసు మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో మల్లేష్‌కు మెరుగైన వైద్య చికిత్స కోసం సీఎం సహాయ నిధి నుంచి రూ.2లక్షల ఎల్ఓసీని బాధితుడు మల్లేష్ కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

# ఘనంగా స్వామి వివేకానంద జయంతి

**కల్వకుర్తి, జనవరి 12, ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ యువజన వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి డీఎస్పీ గిరిబాబు ముఖ్య అతిథిగా హాజరై వివేకానంద స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డు ప్రిన్సిపాల్ సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ వేణు, అధ్యాపకులు రాముడు, సదానందంగౌడ్, రమాకాంత్, మల్లేష్, శ్రీనివాస్, భీమేష్, పరుశరాం, బాలరాజు, నయీం,ఖుర్షీద్‌బేగం,సంతోష్‌గౌడ్, లక్ష్మయ్య ఉన్నారు.

**కల్వకుర్తి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో:** యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద అని కల్వకుర్తి లయన్స్‌క్లబ్ అధ్యక్షులు కలిమిచెర్ల రమేష్ అన్నారు. స్వామి వివేకానంద 160వ జయంతిని పురస్కరించుకొని గురువారం కల్వకుర్తి పట్టణంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను, జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి చిగ్గుల్లపల్లి శ్రీధర్, లయన్స్‌క్లబ్ కోశాధికారి దుగ్గి వెంకటేష్, సంయుక్త కార్యదర్శి మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, మెంబర్‌షిప్ కమిటీ చైర్మన్ గుబ్బ కిషన్, పీఆర్ఓ అప్పాయిపల్లి శ్రీనివాస్, డైరెక్టర్లు వీరేష్, గుబ్బ కృష్ణ, గోవిందు శ్రీనివాసులు, శ్రీను, గోవిందు కృష్ణయ్య, పూరి రమేష్, గందే శ్రీధర్ తదితరులు ఉన్నారు.

**వెల్దండ, జనవరి 12, ప్రభాతవార్త:** స్వామి వివేకానంద ప్రపంచ యువతరానికి శాశ్వత స్ఫూర్తి ప్రధాత అని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి పేర్కొనా్నరు. వెల్దండ మండల కేంద్రంలో వాసవీక్లబ్, ఏబీవీపీల ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 160 జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు వై.విజయేందర్‌రెడ్డి, వాసవీక్లబ్ చార్టర్ ప్రెసిడెంట్‌పూరి రమేష్, నాయకులు మల్లేష్,బాదం పాండు సక్కుబాయి,సంతోష్, శ్రీనివాస్,చిత్తరంజన్,శేఖర్,ఉమేష్, జంగయ్య,రమేష్,మల్లేష్,కొండలు, చరణ్, అనిల్ ఉన్నారు.

**వనపర్తి క్రైమ్,జనవరి 12 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా కె.అపూర్వరావు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ఇన్స్పెక్టర్ శ్రీనివాసాచారి,రిజర్వ్ ఇన్స్పెక్టర్ వెంకట్, జిల్లా పోలీసు కార్యాలయం తాజుద్దీన్, సీపీఎస్ ఎస్‌ఐ హృషికేశ్, ఐటీ కోర్ ఎస్ఐ వేణు, జిల్లా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**దేవరకద్ర,జనవరి 12ప్రభాతవార్త:** దేవరకద్ర మండలంలో గురువారం వివేకానంద 160 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండ ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే కౌకుంట్లలో కూడ వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ యంపీపీ గోపాల్,నాయకులుకిషన్‌రావు,ఉపసర్పంచ్ నీలి నరసింహ్మలు,రవీందర్‌రెడ్డి,కావలి శేఖర్,జగన్నాథ్‌రెడ్డి,గొల్ల అంజనేయులు,అనిల్,శివ,రఘు తదితరులు పాల్గొన్నారు. అలాగే జీన్గరాలలో సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి అధ్వర్యంలో వివేకానంద జయంతివేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవరకద్ర మండలం గోపన్‌పల్లిలో గురువారం వివేకానంద 160 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డిఎస్పీ కిషన్ హాజరయ్యారు.

**బిజినేపల్లి,జనవరి 12 ప్రభాతవార్త:** మండలంలోని ఖానాపూర్ మహా దేవునిపేట బిజినేపల్లి, పాలెం తదితర గ్రామాలలో స్వామి వివేకానంద జయంతి జాతీయ యువజన దినోత్సవాన్ని గురువారం ఆయా యువజన సంఘాల నాయకులు, ప్రజాప్రతి నిధులు, అధికారులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మహాదేవునిపేట సర్పంచ్ ఎద్దుల కళ్యాణి రాజేందర్‌రెడ్డి, ఎంపిటిసి రాధా తిరుపతిరెడ్డి, దారెడ్డి రఘుమారెడ్డి, వట్టెం జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్ భాస్కర్‌కుమార్, వెంకట్‌రెడ్డి, భాస్కరాచారి పలువురు నాయకులు పాల్గొన్నారు.

**అమరచింత,జనవరి 12 ప్రభాతవార్త:** గురువారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని బస్టాండ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేసిన దగర స్వామి వివేకానంద 160వ జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ మాజీ సీనియర్ నాయకులు యల్లా బాలస్వామి, అచల్, కదుదాస్, రాజేష్, వంశీ, మహేష్, కార్తిక్, నవీన్, రామకృష్ణ, సందీప్, ప్రశాంత్, బాలు పాల్గొన్నారు.

**శ్రీరంగాపురం,జనవరి 12 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఆదర్శ ఇంగ్లీష్ మీడియం పాఠశాల స్వామి వివేకానంద జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జయకృష్ణ వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేసి నివాళి అర్పించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

**పెద్దమందడి,జనవరి 12 ప్రభాతవార్త:** నేటి యువత స్వామి వివేకానందున్ని ఆదర్శంగా తీసుకోని ఉన్నత స్థాయికి చేరుకోవాలని పెద్దమందడి వైస్ ఎంపీపీ టి.రఘుప్రసాద్ పిలుపునిచ్చారు. స్వామి వివేకనందుని 160వ జయంతిని మండల పరిధిలోని మద్దిగట్ల గ్రామంలో ఘనంలో జరుపుకున్నారు.కార్యక్రమంలో మద్దిగట్ల మాజీ సర్పంచ్ పుట్టమోని నారాయణ, పంచాయితీ కార్యదర్శి సతీష్ రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు రాములు గౌడ్, నాయకులు బాలకృష్ణ గౌడ్, నత్తి మన్నెం, నత్తి బాలకిష్టన్న, బుద్వేష్‌చారి,భానుప్రకాష్, మొగులయ్య, జల్లి పుల్లన్న, నాగయ్య, బాలరాజు, తదితరులు ఉన్నారు.

**ఖిల్లాఘణపురం,జనవరి 12 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా గురువారం స్వామి వివేకానం చిత్రపటానికి ఎస్ఐ వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళిఅర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సామ్యానాయక్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాళ్ల కృష్ణయ్య, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్, యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మధు, శ్రీనివాసులు గ్రామ యువత పాల్గొన్నారు.

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 12, ప్రభాతవార్త:** తన అద్భుత ప్రసంగంతో ప్రశ్చాత్యుల హృదయాలను సైతం చురగొన్న భారతీయ తత్వవేత్త, గుప్త మేధావి స్వామి వివేకానందుడు నేటి యువతకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులో రాంనగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద స్వామి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వత్‌రెడ్డి, రాజశేఖర్‌రావు, సెక్టోరియల్ అధికారి సతీష్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి,కార్యాలయ పర్యవేక్షకులు సుజాత, సీనియర్ అసిసె ంట్ రవి, తదితరులు ఉన్నారు.

**రాజాపూర్,జనవరి 12 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని కెజిబివి హాస్టల్లో 160వ స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భాన్ని ఉద్దేశించి ఎబివిపి నాయకులు హన్మగళ్ల బాల్‌రాజు మాట్లాడుతూ ఆయన జీవితం యువతకు సూర్తిదాయకం, ఆయన జీవితం యువతకు సూర్తిదాయకం, ప్రతి భారతీయుడిలో దేశభక్తిని పెంపొందించిన భారతదేశ గొప్పదనం గురించి తన జీవితాన్ని త్యాగం చేసినటువంటి గొప్ప త్యాగమూర్తి వివేకానందుని ముఖం చూస్తే యువతకు శక్తిని ఇవ్వగల మహా మేధావి గురించి విద్యార్థులకు తెలియజేయకుండా అడ్డుపడినందుకు మహానుభావుడిని జయంతి వేడుకలు మా మధ్యలో జరపడం సిగ్గుచేటని అన్నారు. ఎస్ఓ తన ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదని, అదేవిధంగా హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు ఎక్కడ బయటపడతాయోనని భ్రమతో ఎబివిపి నాయకులను హాస్టల్‌లోకి అనుమతి ఇవ్వకుండా మీపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించారన్నారు.









## లోక్ అదాలత్‌లో అత్యధికంగా కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి

### -ప్రిన్సిపాల్ జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.రాజేష్ బాబు



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 12 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో నిర్వహించే లోక్ అదాలత్‌లో అత్యధికంగా కేసులు పరిష్కారమయ్యే విధంగా పోలీస్ అధికారులు, న్యాయ విభాగం సమన్వయంతో పనిచేయాలని ప్రిన్సిపాల్ జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.రాజేష్ బాబుసూచించారు.గురువారం ఉదయం రెవెన్యూ, పోలీస్ అధికారులు,పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో కోర్టు హాల్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 11నజిల్లాలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు పెండిం గ్‌లో ఉన్న కేసులను పరిశీలించి కక్ష్యిదారులు రాజీకి వచ్చి పరిష్కరించుకోవాలనుకునే వాటిని లోక్ అదాలత్‌లో పెట్టాలని ఆదేశించారు.సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జీ సబిత, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జీ స్వరూప,జిల్లా ఎస్పీ కె.మనోహర్,డీఎస్పీ మోహన్‌కుమార్, కృష్ణకుమార్, సీఐలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ఎస్ఐలు తదితరులు ఉన్నారు.

## గ్రామాలాభివృద్ధికై ఎంపీ రాములుకు వినతి

**వెల్దండ, జనవరి 12, ప్రభాతవార్త:** గ్రామాలాభివృద్ధికై నిధులు కేటాయించాలని కోరుతూ ఎంపీ పోతుగంటి రాములును బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. వెల్దండ మండలంలోని పలు గ్రామాలాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి గ్రామాలాభివృద్ధికి సహకరించాలని కోరుతూ ఎంపీ రాములుకు గోలి శ్రీనివాస్‌రెడ్డి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గోరటి శ్రీనివాస్,అంజినాయక్, నాయకులు నాగులునాయక్, శ్రీనునాయక్, సుమన్ నాయక్, గణేష్, శ్రీకాంత్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## తిరుమల అఖండ హరినామ సంకీర్తనలలో పాల్గొన్న గుడిదొడ్డి వాసులు

**అయిజ,జనవరి 12 ప్రభాతవార్త :** తిరుమల తిరుపతిలో నిర్వహించే అఖండ హరినామ సంకీర్తనలో మండల పరిధిలోని గుడిదొడ్డ గ్రామానికి చెందిన మారుతి భజన మండలి సభ్యులు అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొని కీర్తనలు ఆలపించారు. అనంతరం మారుతి భజన భక్తుల టిటిడి పాలక మండలి వారు దగ్గరుండి వెంకటేశ్వరస్వామి దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మారుతి భజన భక్తులు ప్రభాకర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, శంకర్, మోహన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, నాగిరెడ్డి, కృష్ణమూర్తిగౌడ్, నాగులన్న, గోపాల్‌రెడ్డి, గోపి, మల్దకల్, లోకేశ్వర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, లక్ష్మన్న, కృష్ణారెడ్డి, లింగన్న, భజన గురువు పర్దీపురం ఆంజనేయులు పాల్గొన్నారు.

## చిన్నారి కంటి శస్త్ర చికిత్స కొరకు ఆర్థిక సహాయం

**కల్వకుర్తి, జనవరి 12 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణానికి చెందిన లావణ్య కుమార్తె సౌమ్య కంటి సమస్యతో బాధపడుతున్నది. గురువారం ఐక్యత ఫౌండేషన్ సభ్యులు లావణ్య కుటుంబాన్ని పరామర్శించి సౌమ్య కంటి శస్త్ర చికిత్స కొరకు ఫౌండేషన్ తరుపున ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యురాలు రేష్మ, రాజేశ్వరి, షాబాన, రెహనా, ఫౌండేషన్ సభ్యులు శ్రీపతి రాజు, ఆవ గణేష్ శేఖర్ తదితరులు ఉన్నారు.

## చిన్నారి కోరికను నేరవేర్చిన ఎమ్మెల్యే మర్రి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి12 ప్రభాతవార్త:** గుడ్ మార్నింగ్ నాగర్‌కర్నూల్ కార్యక్రమంలో భాగంగా బిజనపల్లి మండలంలోని గౌరారం గ్రామంలో 5వ తరగతి చదువుతున్న సొంటే మల్లయ్య కుమార్తె రూప ప్రతిరోజు గౌరారం నుంచి మంగనూర్‌కు స్కూల్‌కు వెళ్లడానికి సైకిల్ ఇప్పించాలని కోరడంతో గురువారం ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి చిన్నారి రూపకు సైకిల్ అందించారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో క్రీడోత్సవాలు

**వనపర్తి క్రైమ్,జనవరి 12 ప్రభాతవార్త:** క్రీడలలోను, నిజజీవితంలోను యువత గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని, క్రీడలతో ఆరోగ్యం, శరీరం దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని జిల్లా ఎస్పీ అపూర్వరావు యువతకు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుల శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉన్నప్పటికీ సిబ్బంది క్రీడల్లో పాల్గొనడం వారిలో నూతనోత్సాహాన్ని నింపుతున్నారు. పోలీసులు వ్యాయామాన్ని నిత్య జీవితంలోనూ భాగం చేసుకోవాలని అన్నారు. క్రీడలు మనలోని నాయకత్వ లక్షణాలను తట్టి లేపడంతో పాటు టీమ్ స్పిరిట్, ఐక్యమత్యాన్ని పెంచుతాయన్నారు. క్రీడల్లో పాల్గొనే వారు శారీరకంగా, మానసికంగా ధృఢంగా ఉంటారన్నారు. క్రీడలు మానసిక స్థైర్యాన్ని ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నాయని అన్నారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా యువకులకు యువజన సంఘాల వారికి జిల్లా స్థాయిలో క్రీడోత్సవాలు నిర్వహించడం జరిగిందని అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్‌లో వారం రోజులుగా కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, 2కెరన్ పోటీలు నిర్వహించి వివిధ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి గెలుపొందిన విద్యార్థులకు, యువతకు బహుమతులు ప్రదానం చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానంలో పోలీసు అధికారులకు క్రికెట్ పోటీలు నిర్వహించి గెలుపొందిన పోలీసు అధికారుల టీంకు ప్రశంసించి బహుమతులు అందజేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన యువతకు అద్భుతంగా నిర్వహించిన పోలీసు అధికారులకు సిబ్బందికి అభినందనలు తెలిపారు.

## విద్యార్థినిలకు స్కూల్ బ్యాగులు పంపిణీ

**ధరూర్,జనవరి 12 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినిలకు తల్లిదండ్రుల సమక్షంలో పాఠశాల ప్రిన్సిపల్ వాణి సొసైటీ మంజూరు చేసిన స్కూల్ బ్యాగులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యార్థులకు సెలవులు ఇవ్వడం జరిగిందన్నారు. పిల్లలను ఇంటి దగ్గర తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. నెలలో రెండవ శనివారం మాత్రమే విద్యార్థులను చూడడానికి తల్లిదండ్రులు పాఠశాలకు రావాలని మధ్య మధ్యలో వచ్చి ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులకు ఇబ్బందిని కలిగించవద్దని ఆమె అన్నారు. మధ్య మధ్యలో వచ్చి ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులకు ఇబ్బందిని కలిగించవద్దని ఆమె అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గీతాదేవి, వేణుగోపాల్, ఉపాధ్యాయులు సునిత, మహిమూద, నాగరాజుతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల కమిటి సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.